Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 342 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 డిసెంబర్ 2023 ఆదివారం పేజీలు : 4

### జనవరి 1 నాటికి 800 కోట్లు దాటేస్తాం..!

వాషింగ్టన్: ప్రపంచ జనాభా మరో మైలురాయిని చేరుకోనుంది. కొత్త ఏడాది ఆరంభానికల్లా ప్రపంచ జనాభా 800 కోట్ల మార్కుని దాటేస్తుందని అమెరికా జనగణన బ్యూరో వెల్లడించింది. ఈ సంస్థ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో.. 2023లో ప్రపంచ జనాభా 7.5 కోట్ల మేర పెరిగిందని, జనవరి 1 నాటికి ఇది 800 కోట్ల మార్కుని అధిగమిస్తుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు కేవలం 1 శాతంలోపే ఉందని తెలిపింది. 2024 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు సగటున 4.3 జననాలు, రెండు మరణాలు సంభవిస్తాయని అమెరికా సెన్సస్ బ్యూరో అంచనా వేసింది. గత సంవత్సర కాలంగా అమెరికా జనాభా వృద్ధిరేటు 0.53 శాతంగా ఉందని, ప్రపంచ వృద్ధిరేటుతో పోలిస్తే ఇది సగమేనని పేర్కొంది.

# 2023 'పొలిటికల్ రౌండప్'



## కాంగ్రెస్‌కు కలిసొచ్చింది

### ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ విస్తరణ, ప్రజాపాలనతో ఏడాది చివర్లో బిజీబిజీ

### 2023లో ఎన్నికల లక్ష్యాన్ని ఛేదించిన హస్తం పార్టీ

హైదరాబాద్ : ఒక్కమాటలో చెప్పాలంటే ఈ ఏడాది కాంగ్రెస్‌కు కలిసొచ్చింది. ఇదే సంవత్సరంలో ఆ పార్టీ అనుకున్న లక్ష్యాన్ని ముద్దాడింది. 2023 మొదట్లో దారీతెన్నూ లేని దిశలో సాగిన టీపీసీసీ ప్రయాణం ఏడాది ముగిసేసరికి విజయతీరాలను చేరింది. సంక్షోభం నుంచి సక్సెస్ వరకు, పోటీ ఇస్తామా అనే స్థాయి నుంచి పవర్ దక్కించుకునేంత వరకు ఈ సంవత్సరం కాంగ్రెస్ పార్టీకి బలాన్నిచ్చింది. ఏడాది చివర్లో ప్రభుత్వ ఏర్పాటు కలను కూడా నెరవేర్చుకుంది.

**డిగ్గీరాజా వచ్చి... ఠాగూర్‌ను తప్పించి** : ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా కాంగ్రెస్ పార్టీలో కలహాలతోనే ప్రారంభమైంది. ఆ పార్టీ నేతలు అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో మాటల యుద్ధానికి దిగారు. ఒకదశలో ఇది తీవ్ర రూపం దాల్చడంతో అధిష్టానం జోక్యం చేసుకుంది. సీనియర్‌నేత దిగ్విజయ్‌సింగ్ అలియాస్ డిగ్గీరాజాను రంగంలోకి దించింది. ఆయన స్థానిక నాయకత్వంతో చర్చించి అధిష్టానానికి కీలక నివేదిక అందజేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో మార్పులు ప్రారంభమయ్యాయి. అప్పటివరకు ఉన్న రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ మాణిక్యంఠాగూర్ అనూహ్యంగా తప్పించి ఆయన స్థానంలో మహారాష్ట్రకు చెందిన మాజీ మంత్రి మాణిక్‌రావ్ ఠాక్రేను అధిష్టానం తెలంగాణకు పంపింది. ఠాక్రే రాక తర్వాత క్రమంగా కాంగ్రెస్ అంతర్గత పరిస్థితులు ఒకొక్కటిగా చక్కబడ్డాయి. రాష్ట్ర నేతల మధ్య సమన్వయం కుదర్చడంలో చాలా మేరకు ఆయన విజయవంతమయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఐక్యరాగాన్ని అందుకున్నారు. పైకి కనిపించిన ఆ ఐక్యరాగమే తెలంగాణ కాంగ్రెస్‌ను ఓ రకంగా విజయతీరాలకు చేర్చిందని చెప్పవచ్చు.

**5 నుంచి 65కు పెరిగిన బలం** : ఈ ఏడాది మొదట్లో కాంగ్రెస్ పార్టీకి ఐదుగురు ఎమ్మెల్యేలే మిగిలారు. 2018 ఎన్నికల్లో గెలిచిన వారిలో మెజారిటీ సభ్యులు పార్టీని వీడడంతో ప్రధాన ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఏడాది తిరిగే సరికి 65 మంది సభ్యుల (మిత్రపక్షమైన సీపీఐతో కలిపి)కు తన బలాన్ని పెంచుకుంది. ఇక, ఏడాది చివర్లో ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటు, మంత్రివర్గ విస్తరణ, ప్రజాపాలన లాంటి కార్యక్రమాలతో బిజీబిజీగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో భట్టి విక్రమార్క లాంటి నాయకుల ఆధ్వర్యంలో వచ్చే ఏడాదిలో లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూసుకెళుతోంది.

**మూడోస్థానం నుంచి మొదటి స్థానానికి** : ఏడాది ఆరంభంలో మూడోస్థానంలో (బీఆర్‌ఎస్, బీజేపీల తర్వాత) ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రక్రియ ఊపందుకునే కొద్దీ రెండో స్థానంలోకి, ఆ తర్వాత మొదటి స్థానంలోకి చేరుకుంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కి పెద్ద బూస్టప్ ఇచ్చాయి. ఆ తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మార్పుతో ఇక కాంగ్రెస్ పార్టీ కి వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. అప్పటికే డిక్లరేషన్‌ల పేరుతో ప్రజల్లోకి వెళుతున్న కాంగ్రెస్, ఆ తర్వాత ఆరు గ్యారంటీలు, ఎన్నికల ప్రచారంలో దూకుడుతో బీఆర్‌ఎస్‌ను వెనక్కి నెట్టగలిగింది. బీఆర్‌ఎస్‌కు తామే ప్రత్యామ్నాయమనే భావనను ప్రజలకు కలిగించడంలో సఫలీకృతమైంది. జూలై మొదట్లో ఖమ్మంలో నిర్వహించిన ప్రజాగర్జనసభ నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ వేవ్ మొదలైంది. సభకు రాహుల్‌గాంధీ హాజరు కావడం, రాష్ట్రమంతా ప్రభావం చూపే విధంగా మాజీ ఎంపీ పొంగులేటి బృందం కాంగ్రెస్‌లో చేరడం, సీఎల్పీ నేత హోదాలో భట్టి విక్రమార్క చేపట్టిన రాష్ట్ర వ్యాప్త పాదయాత్ర ముగింపు అక్కడే జరగడంతో పార్టీ కి కొత్త ఊపు వచ్చింది. అదే ఊపుతో ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్ పార్టీ కి డిక్లరేషన్‌లు, ఆరుగ్యారంటీలకు తోడు తెలంగాణలో అధికారం రావడం తన కల అని సోనియాగాంధీ చేసిన వ్యాఖ్యలు కలిసి వచ్చాయి.

ఇతర పార్టీ ల నుంచి కూడా ఈ ఏడాదిలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి. పార్టీ నుంచి వెళ్లిపోయిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్, జూపల్లి కృష్ణారావు, విజయశాంతి తదితరులు రావడం, మైనంపల్లి హన్మంతరావు, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి లాంటి నేతలు పార్టీ లోకి రావడం పెద్ద బలాన్నే ఇచ్చింది. వెరసి... మూడో స్థానం నుంచి మొదటి స్థానం వరకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతుతో అధికారాన్ని దక్కించుకోగలిగింది.



## 'ఎనిమిది'కి కమలదళం

### ఏడాది మొదల్లో బీజేపీ దూకుడు..

### చివరలో మిశ్రమ ఫలితాలతో హైరానా

అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆశించిన ఫలితాలను రాబట్టలేకపోయింది. 2023 జనవరి నాటికి అప్పటి రాష్ట్రపార్టీ అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పలు విడతలుగా చేపట్టిన 'ప్రజాసంగ్రామ పాదయాత్ర'తో నూతనోత్సాహం వెల్లివిరిసింది. అధికార బీఆర్‌ఎస్‌కు రాజకీయ ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎదుగుతుందని, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీ మూడోస్థానానికి పరిమితం అవుతుందన్న స్థాయిలో పెద్ద ఎత్తున హైప్ వచ్చింది. కానీ బండి సంజయ్ మార్పుతో పరిస్థితి క్రమక్రమంగా తారుమారు అయ్యింది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య వర్గపోరు తారస్థాయికి చేరింది. అసెంబ్లీ ఎన్నికలకు కొద్దినెలల ముందే అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కిషన్‌రెడ్డి అంతగా సుముఖంగా లేకపోయినా అధిష్టానం ఒత్తిడితో అయిష్టంగానే నాయకత్వ భారాన్ని మోసేందుకు సిద్ధమయ్యారు. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, యెన్నం శ్రీనివాసరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి వంటి నాయకులు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కారణంగానే అసెంబ్లీ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలను బీజేపీ సాధించలేకపోయిందనే చర్చ కూడా పార్టీలో జరిగింది.

**2018లో 1 సీటు...7 శాతం ఓటింగ్‌తో మొదలై...** : 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌లోనే గెలిచింది. 105 స్థానాల్లో ఆ పార్టీకి డిపాజిట్లు కూడా దక్కలేదు. కేవలం ఏడుశాతం ఓట్లు రాగా, ఆరునెలలలోపే 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 4 ఎంపీ సీట్లు గెలుపొంది 19 శాతం ఓటింగ్‌ను సాధించి బీజేపీ సత్తా చాటింది. అప్పటి నుంచి మూడేళ్ల వ్యవధిలో వరుసగా జరిగిన దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో గెలుపు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 2 సీట్ల నుంచి ఏకంగా 48 స్థానాల్లో గెలుపు, మొదటిసారిగా పార్టీ బీ ఫామ్‌పై టీచర్ ఎమ్మెల్సీ స్థానం నుంచి ఏవీఎన్‌రెడ్డి సంచలన విజయం సాధించి, రాజకీయంగా ప్రజల మద్దతు సాధించి ముందుకుసాగింది. నాగార్జున సాగర్ ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి తీసికట్టుగా ఓట్లు రావడం, మునుగోడు ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాజ్‌గోపాల్‌రెడ్డి 12 వేల పైచిలుకు ఓట్లతో ఓటమి చవిచూసినా ఫలితం వెలువడే దాకా నువ్వానేనా అంటూ బీఆర్‌ఎస్‌కు బీజేపీ చెమటలు పట్టించింది, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర బీజేపీకి జాతీయ నాయకత్వం అన్నిరకాలుగా అండదండలు అందించి మద్దతుగా నిలిచింది. రెండు,మూడునెలల వ్యవధిలోనే ప్రధాని మోదీ పది సార్లకు పైగా తెలంగాణలో పర్యటించారు. అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామని, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు జాతీయపార్టీ మద్దతు ప్రకటన, కేంద్రప్రభుత్వ సానుకూల నిర్ణయం వంటివన్నీ కూడా రాష్ట్రంలో బీజేపీ గణనీయమైన సంఖ్యలో సీట్లు గెలిచేందుకు దోహదపడలేదనే అభిప్రాయంలో పార్టీనాయకుల్లో నెలకొంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రపార్టీ అధ్యక్షుడి మార్పు, ఆలస్యంగా అభ్యర్థుల ఖరారు, తెలంగాణలో ఏమాత్రం బలం, ఉనికి లేని జనసేనతో పొత్తు కుదుర్చుకొని 8 సీట్లు కేటాయించడం వంటి అంశాలు బీజేపీ ఎన్నికల ఫలితాల సాధనలో ప్రభావం చూపాయి.



ఫలించని ప్రవీణ్ వ్యూహం




ఆశించిన ఫలితం సాధించలేకపోయిన ఎంఐఎం

## నెరవేరని బీఆర్‌ఎస్ 'హ్యాట్రిక్' కల

## మూడో 'సారి'




### ఏడాది పొడవునా ఎన్నికల కోణంలోనే పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలు

### కేంద్ర ప్రభుత్వం, గవర్నర్‌తో ఘర్షణ వైఖరి, కవితకు ఈడీ నోటీసులు

### ఏడాది చివరిలో శ్వేతపత్రం, స్వేదపత్రం పేరిట కాంగ్రెస్‌తో యుద్ధం

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధించాలన్న బీఆర్‌ఎస్ కోరిక నెరవేరలేదు. తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యంగా 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. పార్టీని విస్తరించే లక్ష్యంతో గత ఏడాది భారతరాష్ట్ర సమితిగా పేరు మార్చుకుంది. జాతీయ స్థాయిలో పార్టీ కార్యకలాపాలు, శాసనసభ ఎన్నికలు లక్ష్యంగా ఈ ఏడాది ఆరంభం నుంచే సన్నద్ధమైంది.

**జాతీయస్థాయిలో విస్తరణే లక్ష్యంగా...** బీఆర్‌ఎస్‌గా పేరు మార్చుకున్నాక పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జనవరి 18న ఖమ్మంలో తొలి బహిరంగసభ జరిగింది. ముఖ్యమంత్రులు అర్వింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), భగవంత్‌మాన్ (పంజాబ్), పినరయి విజయ్ (కేరళ)తో పాటు యూపీ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్‌యాదవ్, సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి డి.రాజా హాజరయ్యారు. ఏపీ బీఆర్‌ఎస్ శాఖ అధ్యక్షుడిగా పార్టీలో కొత్తగా చేరిన తోట చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఒడిషా మాజీ ముఖ్యమంత్రి గిరిధర్ గమాంగ్‌తో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వివిధ పార్టీలకు చెందిన నేతలు బీఆర్‌ఎస్‌లో చేరారు. మహారాష్ట్రలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా తొలిసారిగా ఫిబ్రవరి 5న నాందేడ్‌లో జరిగిన తొలి బహిరంగసభకు కేసీఆర్ హాజరయ్యారు. మార్చి 26న కాందార్ లోహ, ఏప్రిల్ 24న ఔరంగాబాద్ సభల్లోనూ కేసీఆర్ పాల్గొన్నారు. మే 19న నాందేడ్‌లో రెండు రోజుల కార్యకర్తల శిబిరాన్ని ప్రారంభించిన కేసీఆర్ జూన్ 15న నాగపూర్‌లో పార్టీ శాశ్వత కార్యాలయాన్ని ప్రారంభించారు. జూన్ 23న మహారాష్ట్ర పర్యటనకు రోడ్డు మార్గాన భారీ కాన్వాయ్‌తో వెళ్లి పండరీపూర్, తుల్జాపూర్ ఆలయాల్లో పూజలు చేశారు. ఆగస్టు ఒకటిన కొల్హాపూర్‌లో అన్నాభావ్ సాఠే వర్ధంతి కార్యక్రమంలో కేసీఆర్ పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీ కవితకు ఈడీ నోటీసులు** : ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మార్చి 8న నోటీసులు జారీ చేసింది. మార్చి 11న కవిత ఈడీ విచారణకు హాజరైంది. కవితపై ఈడీ విచారణకు పలు మార్లు నోటీసుల జారీ అంశం బీఆర్‌ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. మరోవైపు తీహార్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ అటు కేటీఆర్, ఇటు కవితను ఉద్దేశిస్తూ లేఖలు విడుదల చేయడంతో విపక్షాల విమర్శలకు దారితీసింది. టీఎస్‌పీఎస్సీ, పదోతరగతి ప్రశ్నపత్రాల లీకేజీ అంశాలు కూడా బీఆర్‌ఎస్‌కు తలనొప్పులు సృష్టించాయి.

**గవర్నర్‌తో ఘర్షణ** : రాష్ట్ర గవర్నర్‌తోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘర్షణ వైఖరి కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్‌ను కారణంగా చూపడంతో గణతంత్ర వేడుకలు రాజ్‌భవన్‌లోనే జరి గాయి. ఫిబ్రవరి మొదటివారంలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభల భేటీలో గవర్నర్ ప్రసంగం అంశంపై రాజ్‌భవన్, ప్రగతిభవన్ నడుమ కోల్డ్‌వార్ జరిగింది. చివరకు గవర్నర్ ప్రసంగానికి ప్రభుత్వం ఓకే చెప్పగా, బడ్జెట్ ప్రవేశ పెట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. అసెంబ్లీ పంపిన బిల్లులు గవర్నర్ ఆమోదించడం లేదంటూ రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. గవర్నర్ కోటాలో శాసనమండలికి రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించిన దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను గవర్నర్ తమిళిసై తిరస్కరించగా, రాజకీయాలకు రాజ్‌భవన్ అడ్డాగా మారిందని బీఆర్‌ఎస్ ఆరోపించింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే బిల్లుపైనా గవర్నర్, ప్రభుత్వం నడుమ మాటల యుద్ధం జరిగింది. మరోవైపు కేంద్రంతోనూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఘర్షణ ఏడాది పొడవునా కొనసాగింది. కేటీఆర్ పలు సందర్భాల్లో ప్రధాని మోదీకి కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ మొదలుకొని రాష్ట్రానికి సంబంధించిన అనేక అంశాలపై లేఖలు రాశారు.

**ఫిబ్రవరి నుంచే...** ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే బీఆర్‌ఎస్ వివిధ రూపాల్లో అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధమైంది. సీపీఐ, సీపీఎంతో ఎన్నికల అవగాహన ఉంటుందని మొదట్లో భావించినా, అది కుదరలేదు. శాసనమండలి స్థానిక సంస్థల ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి ఎంఐఎం అభ్యర్థి రహమత్ బేగ్‌కు మద్దతు ప్రకటించింది. మార్చి 12 నుంచి నియోజకవర్గస్థాయిలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు ప్రారంభించి మే నెలాఖరు వరకు కొనసాగించింది. జూన్‌లో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పేరిట 20 రోజుల పాటు గ్రామస్థాయి వరకు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేశారు. సచివాలయం, భారీ అంబేడ్కర్ విగ్రహం, అమరుల జ్యోతి ప్రారంభం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించింది. వివిధ జిల్లాల కలెక్టరేట్ల ప్రారంభం సందర్భంగా బీఆర్‌ఎస్ భారీ సభలు ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 27న తెలంగాణ భవన్‌లో పార్టీ ప్లీనరీ జరగ్గా, రెండు రోజుల ముందే జిల్లాల్లోనూ మినీ ప్లీనరీలు నిర్వహించారు.

**ఒకేసారి 115 మంది జాబితా..** షెడ్యూల్ రాకముందే ఆగస్టు 21న ఒకేసారి 115 మంది అభ్యర్థులతో కూడిన జాబితాను కేసీఆర్ ప్రకటించారు. జాబితాలో ఉన్న మైనంపల్లి హన్మంతరావు పార్టీని వీడగా, అలంపూర్ అభ్యర్థి అబ్రహంకు చివరి నిమిషంలో టికెట్ నిరాకరించారు. ఏడుగురు సిట్టింగులకు టికెట్లు నిరాకరించారు. టికెట్లు ఆశించిన జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్ నుంచి బహిష్కరణకు గురయ్యారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకమునుపే అక్టోబర్ 15న పార్టీ అభ్యర్థులకు బీ ఫారాలు అందజేశారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 28 వరకు మూడు విడతల్లో పార్టీ అధినేత కేసీఆర్ 97 నియోజకవర్గాల్లో బహిరంగసభల్లో పాల్గొన్నారు. నవంబర్ 30న పోలింగ్ జరగ్గా, డిసెంబర్ 3న వెలువడిన ఫలితాల్లో 39 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపొందారు.

**కేసీఆర్‌కు శస్త్ర చికిత్స** : సీఎం పదవికి రాజీనామా చేసిన కేసీఆర్ ఎర్రవెల్లిలోని తన ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు. డిసెంబర్ 8న బాత్‌రూంలో కాలు జారడంతో ఆస్పత్రిలో చేరిన కేసీఆర్ శస్త్ర చికిత్స అనంతరం డిసెంబర్ 15న డిశ్చార్జి అయ్యారు. డిసెంబర్ 9 నుంచి ప్రారంభమైన శాసనసభ సమావేశాల్లో కొత్త ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయడంపై బీఆర్‌ఎస్ మండిపడింది. శ్వేతపత్రం తప్పులతడక అంటూ డిసెంబర్ 24న తెలంగాణభవన్‌లో కేటీఆర్ 'స్వేదపత్రం'విడుదల చేశారు.

# సంపాదకీయం

## మోడీ సర్కార్ భారీ దౌత్య విజయం

నిజానికి చిన్న అంశాలకు భారీ ప్రాధాన్యతను ఇచ్చే మీడియా.. కొన్ని అంశాలను మాత్రం పెద్దగా ఫోకస్ చేయదన్న ఆరోపణ పలువురి నోటి నుంచి తరచూ వినిపిస్తూ ఉంటుంది. తాజాగా అలాంటి వాదన బలం చేకూరే పరిణామం ఒకటి చోటు చేసుకుంది. ఇటీవల కాలంలో మోడీ సర్కారు సాధించిన అతి పెద్ద దౌత్య విజయంగా దీన్ని చెప్పుకోవాలి. గూఢచర్యం ఆరోపణలపై అరెస్టు అయి.. ఖతర్ లో మరణశిక్ష పడిన భారత్ కు చెందిన ఎనిమిది మంది మాజీ సీనియర్ నేవీ అధికారులకు గొప్ప ఊరట లభించింది. వారికి విధించిన మరణశిక్షను తగ్గిస్తూ.. ఖతర్ న్యాయస్థానం కీలక తీర్పును వెలువరించింది. మరణ శిక్షకు బదులుగా జైలుకు సవరించిన ఈ తీర్పుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. తాజాగా జైలుశిక్షకు పరిమితమైన తీర్పులో.. ఎంతకాలం జైలు అన్న విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. దుబాయ్ లో జరిగిన కాప్ 28 సదస్సు వేదికగా ఖతర్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీని ప్రధాని మోడీ కలిసిన కొన్ని వారాలకే వెలువడిన ఈ కోర్టు తీర్పు ఆసక్తికరంగా మారింది. తాజా తీర్పు నేపథ్యంలో కేంద్రం స్పందించింది. తాజా తీర్పుపైనా.. జైలుశిక్ష రద్దు కాకపోవటంపైనా ఏం చేయాలన్నదానిపై లా టీంలు.. బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్నట్లుగా పేర్కొన్నారు. తీర్పు వెలువడే సమయానికి భారత రాయబారి కోర్టులోనే ఉన్నట్లుగా చెబుతున్నారు. తీర్పు పత్రాలు చూస్తే కానీ.. జైలుశిక్షకు సంబంధించిన వివరాలపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. నిజానికి ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ భారత నేవీ అధికారులు ఇజ్రాయెల్ తరఫున గూఢచర్యం చేసినట్లుగా చెబుతారు. అయితే.. అందులో ఏ మాత్రం నిజం లేదన్నది భారత్ వాదన. ఎందుకంటే ఖతర్ జైల్లో ఉన్న మాజీ అధికారులు నేవీలో అత్యున్నత హోదాలో పని చేసి రిటైర్ అయిన వారు. అరెస్టు నాటికి వీరంతా ఖతర్ సైనిక దళాలకు శిక్షణ తదితర సేవలు అందించే దహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ అండ్ కన్సెల్టెన్సీ సర్వీసెస్ అనే ఒక ప్రైవేటు సంస్థలో పని చేస్తున్నారు. గూఢచర్యం కేసులో మరణశిక్షను ఎదుర్కొంటున్న వారిలో ఒకరు ఏపీలోని విశాఖ జిల్లాకు చెందిన వారు కూడా ఉన్నారు. గత ఏడాది ఆగస్టులో వీరిని అరెస్టు చేశారు. అక్టోబరులో వీరికి మరణశిక్ష విధించినట్లుగా తీర్పు వచ్చింది. విచారణ సందర్భంగా పలుమార్లు బెయిల్ పిటిషన్లు రిజెక్టు అయ్యాయి. గత నెలలో మరణశిక్ష తగ్గింపునకు పిటిషన్ దాఖలు చేయగా కోర్టు సానుకూలంగా స్పందించింది. తాజాగా.. మరణశిక్షను రద్దు చేస్తూ జైలుశిక్షకు పరిమితం చేసినట్లుగా వారతలు వచ్చాయి. అయితే.. వీరిందరి జైలుశిక్షలు రద్దై.. భారత్ కు తిరిగి రావాలన్నదే మోడీ సర్కారు లక్ష్యంగా చెబుతున్నారు. ఏమైనా.. తక్షణ ముప్పుగా ఉండే మరణశిక్షను రద్దు చేయటం దౌత్యపరంగా సాధించిన చక్కటి విజయంగా పలువురు అభివర్ణిస్తున్నారు. మోడీ ప్రభుత్వమే కాదు.. కాంగ్రెస్ సీనియర్ నేతలు సైతం వీరంతా క్షేమంగా దేశానికి తిరిగి రావాలని కోరుకుంటున్నారు.

# విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ప్రతిభా పురస్కరాల ఎంతగానో దోహదపడతాయి



శామీర్ పేట (గరుడ వార్త) : విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించడం ద్వారా వారు మరింత శ్రద్ధతో విద్యాభ్యాసం చేసేందుకు దోహదపడుతుంది. పదవ తరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను శనివారం అందజేశారు. శామీర్ పేట మండలం తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి మండల స్థాయి, స్థానిక పాఠశాల స్థాయిలో ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో వచ్చిన విద్యార్థులకు 12 వ సంవత్సరం ప్రతిభ పురస్కారాల అవార్డు కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ ప్రధమ అవార్డును శామీర్ పేట మండలం అలియాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బండారు సత్య మనోహర్ ఇంగ్లీష్ మీడియం, అలాగే పొన్నాల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన కె భవిత తెలుగు మీడియంకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బెజగం ఆనందరావు తన తల్లిదండ్రులు బెజగం ఆగయ్య గౌరమ్మ ల జ్ఞాపకార్థం అందించారు. మండలంలోని లాల్ గడి మలక్ పేట జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన వి. వైష్ణవి ఇంగ్లీష్ మీడియం, పొన్నాల జెడ్పి పాఠశాలకు చెందిన ఎం. అక్షిత తెలుగు మీడియంకు ద్వితీయ అవార్డు ను చింతల శ్రీనివాస్ రెడ్డి తన తండ్రి చింతల సుధాకర్ రెడ్డి జ్ఞాపకార్థం అందించారు. మండలంలోని లాల్ గడి మలక్ పేట జెడ్పీ పాఠశాలకు చెందిన ఇలా సాగరం వాణి ఇంగ్లీష్ మీడియం, జడ్పీ పాఠశాలకు చెందిన కావలి కీర్తన తెలుగు మీడియం లకు తృతీయ అవార్డు బర్రెంకబావి రవీందర్ రెడ్డి తన తల్లిదండ్రులు బర్రెంకబావి చంద్రారెడ్డి బుచ్చమ్మ ల జ్ఞాపకార్థం విద్యార్థులకు నగదుతో పాటు షీల్డ్ లను అందజేసి అభినందించారు. 1968-1969 బ్యాచ్ పాఠశాల పూర్వం విద్యార్థులు పలువురు పాఠశాలకు విచ్చేసి మండల మరియు స్థానిక పాఠశాల స్థాయిలో పదోతరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. అదేవిధంగా 6 వ తరగతి నుండి 9 వ తరగతి వరకు విద్యార్థులకు ప్రధమ, ద్వితీయ బహుమతులను డాక్టర్ రామారావు, సముద్రాల లక్ష్మయ్య అందజేశారు. పాఠశాలలో 6 వ తరగతి నుండి 9 వ తరగతి వరకు అత్యధిక శాతం పాఠశాలకు హాజరైన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ అవార్డులను ఇటీవల బదిలీ అయి వేళ్ళిన ఉపాధ్యాయురాలు మాధవి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయి చదువులు చదివి మంచి ఉద్యోగాలలో స్థిరపడి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం అవార్డులు అందజేస్తున్న దాతలను, అతిథులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో 11 వ వార్డు కౌన్సిలర్ నర్సింగరావు గౌడ్, మాజీ సర్పంచ్ గోల్డ్ శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి జైపాల్ రెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త పట్నం నర్సింహ్మారెడ్డి, ఇటీవల బదిలీ అయిన ప్రధానోపాధ్యాయురాలు స్వరూప రాణి, అలియాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్, పొన్నాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు గులం మూర్తుజ, లాల్ గడి మలక్పేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ప్రభాకర్, తుర్కపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రం, పూర్వ విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# శామీర్ పేటకు చేరుకున్న అయోధ్య రామయ్య అక్షింతలు



శామీర్ పేట ( గరుడ వార్త) : అయోధ్య రామయ్య అక్షింతలు శనివారం రాత్రి శామీర్ పేట కు చేరుకున్నాయి.

మండల కేంద్రం శామీర్ పేట కు అక్షంతలు రాగా వీరభద్ర స్వామి ఆలయం నుంచి రామాలయం వరకు యువకులు ఊరేగింపు రామయ్య తలంబ్రాలను తీసుకువెళ్లారు. దీంతో గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి అక్షంతలను స్వీకరించారు. అక్షంతలను ఊరేగింపుగా ఎంతో ఉత్సాహంగా ఆనందోత్సవాల మధ్య గ్రామ పరిధిలోని రామాలయం కు తీసుకువెళ్లారు. ఈ అక్షంతలను ఆలయంలో భద్రపరిచి తదనంతరం గ్రామంలో పంచనున్నట్లు యువకులు తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి అక్షంతలను చేరవేస్తామని యువకులు తెలిపారు. ఈ కార్యక్రమ ంలో గ్రామస్తులు, మహిళలు, యువకులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఊరూరా కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

శామీర్ పేట (గరుడ వార్త) : ప్రజా పాలన దరఖాస్తు ఫారాలను తీసుకునేందుకు అదేవిధంగా అధికారులకు నింపిన ఫారాలను అధికారులకు అందించేందుకు బారులు తిడుతున్న ప్రజలు. తూముకుంట మున్సిపాలిటీ శామీర్ పేట మూడు చింతలపల్లి మండలాల మండలంలోని గ్రామాలలో అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రజాపాలన కార్యక్రమం శనివారం కొనసాగింది. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరించారు. ఉమ్మడి శామీర్ పేట మండలంలోని వివిధ గ్రామాలలో ఆరు గ్యారెంటీ ల దరఖాస్తుల



స్వీకరణ కొనసాగించారు. మండలంలోని బొమ్మ రాసిపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్ గౌడ్ అధికారులతో కలిసి దరఖాస్తులను స్వీకరించాడు. దరఖాస్తులను సమర్పించడానికి ప్రజలు ఆయా గ్రామాల్లో మూడో రోజు అధికంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్లు సత్యనారాయణ, వాణి రెడ్డి, ఎంపీడీవోలు వాణి, వత్సల దేవి, తూముకుంట మున్సిపల్ పరిధిలో చైర్మన్ రాజేశ్వరరావు, వైస్ చైర్ పర్సన్ వాణి వీరారెడ్డి, కమిషనర్ జైత్రం నాయక్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్మరణతో మారుమోగిన ఉప్పరపల్లి పట్టణం

శామీర్ పేట (గరుడ వార్త) : ఘనంగా అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ పరిధిలో ఉప్పర్ పల్లికి చెందిన కరకపట్ల మనీష్ కన్యసామి రాము గురుస్వామి లు అయ్యప్ప స్వామి మహా పడిపూజను నిర్వహి



ంచారు. అయ్యప్ప స్వామి మూర్తిని గ్రామంలో పల్లకిలో ఊరేగించి పూజ స్థలానికి తీసుకువచ్చారు. వివిధ మండలాలలోని అయ్యప్ప భక్తులు పెద్ద ఎత్తున పూజలో పాల్గొన్నారు. ఆ ప్రాంతమంతా అయ్యప్ప నామస్మరణతో మారుమోగింది. భజన మండలి ఆలపించిన గీతాలు అయ్యప్ప భక్తులను ఆకట్టుకున్నాయి.

## జనవరి 1 నాటికి 800 కోట్లు దాటేస్తాం..!

వాషింగ్టన్: ప్రపంచ జనాభా మరో మైలురాయిని చేరుకోనుంది. కొత్త ఏడాది ఆరంభానికల్లా ప్రపంచ జనాభా 800 కోట్ల మార్కుని దాటేస్తుందని అమెరికా జనగణన బ్యూరో వెల్లడించింది. ఈ సంస్థ తాజాగా విడుదల చేసిన గణాంకాల్లో.. 2023లో ప్రపంచ జనాభా 7.5 కోట్ల మేర పెరిగిందని, జనవరి 1 నాటికి ఇది 800 కోట్ల మార్కుని అధిగమిస్తుందని పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా వృద్ధిరేటు కేవలం 1 శాతంలోపే ఉందని తెలిపింది. 2024 ప్రారంభంలో ప్రపంచవ్యాప్తంగా ప్రతి సెకనుకు సగటున 4.3 జననాలు, రెండు మరణాలు సంభవిస్తాయని అమెరికా సెన్సస్ బ్యూరో అంచనా వేసింది. గత సంవత్సర కాలంగా అమెరికా జనాభా వృద్ధిరేటు 0.53 శాతంగా ఉందని, ప్రపంచ వృద్ధిరేటుతో పోలిస్తే ఇది సగమేనని పేర్కొంది.

# ఆశలు పదిలం!

జయశంకర్ : ప్రధాని మోదీ ప్రకటనతో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుపై సుదీర్ఘ కాలంగా ఉన్న అపోహలకు తెరపడింది. రాష్ట్ర విభజన కాలం నాటి కల సాకారం కాబోతోందని జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన వర్సిటీకి వారి ఆరాధ్య దేవతలైన సమ్మక్క-సారక్క పేరు పెడుతున్నట్లు వెల్లడించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నూతన విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు ఈ విద్యా సంవత్సరంలోనే ప్రారంభమవుతాయా లేక వచ్చే విద్యా సంవత్సరంలో జరుగుతాయా అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే దేశంలోని కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాల్లో ఈ విద్యా సంవత్సరానికి(2023-24) ప్రవేశాల ప్రక్రియ ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా జరిగింది. ఈ విద్యా సంవత్సరంలోనే ప్రవేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తే అందుకు ప్రత్యేక ప్రవేశ పరీక్షను జరుపుతారా, భవనాలు వసతి తాత్కాలికంగా ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

**335.16 ఎకరాలు కేటాయింపు**

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అనేది రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పొందుపర్చింది. యూనివర్సిటీ ఏర్పాటుకు సుదీర్ఘ అన్వేషణ అనంతరం ములుగు జిల్లా అనువుగా ఉంటుందని భావించారు. ములుగు సమీపంలోని గట్టమ్మ గుడికి ముందు, జాతీయ రహదారికి దక్షిణం వైపు ఉన్న 335.16 ఎకరాల స్థలాన్ని ఖరారు చేశారు. పలుమార్లు హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ ప్రతినిధులు వచ్చి స్థలాన్ని పరిశీలించి అనువుగానే ఉందని నిర్ధారించి సంతృప్తి చెందారు. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక కూడా పంపారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తయి సుమారు మూడేళ్లు కావస్తోంది. అయినప్పటికీ యూనివర్సిటీ ఊసు లేకపోవండం, పార్లమెంటు సమావేశాల్లోనూ ప్రస్తావన రాకపోవడంతో ఇక రాకపోవచ్చని అందరూ భావించారు. రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు ఆందోళనా కార్యక్రమాలు కూడా చేశారు. ఈ ప్రాంత ప్రజల్లో ఉన్న అపోహలను భారత ప్రధాని పటాపంచలు చేశారు.

**గిరిజనుల జీవన ప్రమాణాలు మెరుగయ్యే అవకాశం**

ఆదివాసీలు అత్యధికంగా ఉన్న ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు వల్ల ఆదివాసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన స్థితి గతులపై విస్తృతమైన పరిశోధనలు చేసేందుకు ఎంతో అవకాశం ఉంటుంది. పరిశోదనల ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశాలున్నాయి. అధ్యయనాలు, పరిశోధనల ఆధారంగా ప్రభుత్వ పాలసీలో మార్పులు వచ్చే అవకాశం ఉంటుంది. గిరిజనులు ఉన్నత విద్యలో రాణించడానికి రకరకాల కోర్సులు ఏర్పాటు చేసే



అవకాశం ఉంటుంది. గిరిజనులు అందిపుచ్చుకునే అవకాశం ఉంటుంది.

**రవాణా అనుకూలం**

గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు రవాణా పరంగానూ అనుకూలంగా ఉంది. హైదరాబాద్- భూపాలపట్నం జాతీయ రహదారికి ఆనుకొని స్థలం నిర్ధారించారు. వరంగల్ నుంచి రోడ్డు మార్గం ద్వారా 45 నిమిషాల్లో నిర్దేశించిన గిరిజన యూనివర్సిటీకి చేరుకునే అవకాశాలున్నాయి. హైదరాబాదు వరకు వరంగల్ నుంచి విమాన సౌకర్యం రానుంది. వరంగల్, కాజీపేట రైల్వే స్టేషన్లు ఉండటం వల్ల దేశంలో అన్ని ప్రాంతాలకు రాకపోకలున్నాయి.

**చకచకా భూసేకరణ**

గిరిజన యూనివర్సిటీకి ములుగు సమీపంలోని గట్టమ్మ గుడి వద్ద మొత్తం 335.16 ఎకరాలు కేటాయించారు. భూసేకరణకు గిరిజన సంక్షేమ శాఖ రూ.10 కోట్లు కేటాయించి ప్రక్రియను చకచకా నిర్వహించారు. సేకరించిన స్థలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూమి 285 ఎకరాలు, అటవీ భూమి 50 ఎకరాలు ఉంది. రెవెన్యూ భూమిని గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించారు. స్థలానికి హద్దులు నిర్ధారించారు. ఈ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి రెండేళ్ల కింద గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా చేశారు. తాత్కాలికంగా తరగతులు నిర్వహించాలనుకుంటే ములుగు మండలం జాకారంలోని గిరిజన యువజన శిక్షణ కేంద్రం అనువుగా ఉంటుందని భావించి నిర్ణయించారు.

**గిరిజన యూనివర్సిటీని ప్రకటించడం హర్షణీయం**

అజ్మీరా సీతారాం నాయక్, మాజీ ఎంపీ, విశ్రాంత ప్రొఫెసర్

గిరిజన యూనివర్సిటీ ఇచ్చినందుకు ధన్యవాదాలు. యూనివర్సిటీలో గిరిజనులకు సీట్లు పెంచాలి. తాను ప్రొఫెసర్‌గా ఉన్నప్పుడు గిరిజన యూనివర్సిటీ ఆంధ్రాకు తరలించాలనుకునే సమయంలో పోరాడి అడ్డుకున్నాం. తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ కేటాయించారు. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

**స్థానికులకు ప్రాధాన్యం ఇవ్వాలి**

గోనా నాయక్, సెంట్రల్ యూనివర్సిటీ సీనియర్ ప్రొఫెసర్

గిరిజన విద్యార్థులకు స్థానికతను ఆధారం చేసుకొని సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలి. ఇక్కడి గిరిజన విద్యార్థులకు అనుకూలమైన కోర్సులను ప్రవేశపెట్టాలి. గిరిజనుల భాష, సంస్కృతి సంప్రదాయాలు, సాహిత్యం ప్రతిబింబించే విధంగా ఉండాలి. ప్రత్యేక పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. స్థానిక భాషకు అనుగుణంగా తెలుగు కోర్సులు ప్రవేశపెట్టాలి. పరిశోధనలు బాగా జరగాలి. గిరిజన సంస్కృతిని కాపాడాలి.

**పరిశోధనలకు మంచి అవకాశం**

కొర్నిబెల్లి గణేష్, బిర్సా ముండా పరిశోధన కేంద్రం, కామారం, తాడ్వాయి మండలం ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడం శుభ పరిణామం. ఇక్కడ యూనివర్సిటీ ఏర్పాటు చేయడం వల్ల పరిశోధనలు చేయడానికి మంచి అవకాశం ఉంటుంది. యావత్ ఆదివాసీ ప్రజలకు యూనివర్సిటీ ద్వారా పరిశోధనర ఫలాలు, అభివృద్ధి జరగుతుందని ఆశిస్తున్నాం.


**పోరాట ఆకాంక్ష నెరవేర్చుకునే అవకాశం**

మైపతి అరుణ్ కుమార్, రీసెర్చ్ స్కాలర్, తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ములుగు జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించడం శుభ పరిణామం. సమ్మక్క-సారలమ్మ పోరాట ఆకాంక్ష నెరవేర్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అదివాసీ ప్రజలకు ములుగు అందుబాటులో ఉండే ప్రాంతం. మధ్య భారతదేశంలో ఉన్న ఆదివాసీ విద్యార్థులకు బాగా ఉపయగపడనుంది. పరిశోధన ప్రయోజనాలు ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడతాయి. గిరిజన మహిళా సాధికారతధనసరి లలిత, రీసెర్చ్ స్కాలర్, సమ్మక్క-సారక్క ఆర్కియలాజికల్ రీసెర్చ్ సెంటర్, కామారం గిరిజన యూనివర్సిటీ ద్వారా మహిళా సాధికారతకు అవకాశం ఉంది. గిరిజన మహిళలకు ఉన్నత విద్య అవకాశాలు మెరుగై వారు సాధికారత సాధించే అవకాశం ఉంది.

# ఇక ఇవ్వాల్సిందే..!

హుజూర్‌నగర్ : 'సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు వెంటనే బకాయిలు ఇవ్వాలి. ధాన్యంగానీ, బియ్యంగానీ లేదా నగదు ఇచ్చేందుకు వారికి అవకాశం కల్పిస్తాం. బకాయిదారుల నుంచి బకాయిల వసూలు విషయంలో ఇక ఉపేక్షించేది లేదు'.. అని ఇటీవల పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బకాయిదారులే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణకు సిద్ధం అవుతోంది. ఇప్పటి వరకు సీఎంఆర్ ధాన్యం తీసుకొని సకాలంలో పెట్టకుండా ధాన్యాన్ని తమ వ్యాపారాభివృద్ధికి ఉపయోగించుకుని అధికారులను ముప్పతిప్పలు పెడుతున్న మిల్లర్లు ఇక బియ్యం లెవీ చెల్లించాల్సిందేనని ప్రభుత్వం అంటోంది.

లెక్క తప్పితే ఇబ్బందే: పౌరసరఫరాలశాఖ నష్టాలు, అప్పుల్లో ఉందని గుర్తించిన ప్రభుత్వం ఏ మేరకు సాధ్యమైతే అంతవరకు పూడ్చుకునేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా బకాయిల జాబితాను సిద్ధం చేసింది. వీటిని వెంటనే వసూలు చేయడం వల్ల కార్పొరేషన్ మనుగడకు ఇబ్బంది ఉండదని అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది. దీంతో జిల్లాల వారీగా బకాయిలు ఉన్న మిల్లర్ల జాబితా సిద్ధం చేస్తున్నారు. సీఎంఆర్ ధాన్యం తీసుకున్న మిల్లర్లు ధాన్యం, బియ్యం, నగదు మూడింటిలో ఏది ఇచ్చినా తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇంకా మొరాయిస్తే ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతుందని హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రభుత్వం అనేక వాయిదాలు ఇచ్చినా మిల్లర్లు తిరిగి ఇవ్వకపోవడంతో వారిపై చర్యలకు సిద్ధం అవుతున్నట్లు సమాచారం.



ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి దాదాపు 7,01,374 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా.. ఇప్పటి వరకు 6,00,147 మెట్రిక్ టన్నులు వసూలైంది. ఇంకా 1,01,227 మెట్రిక్ టన్నుల బియ్యం లెవీ పెట్టాల్సి ఉంది. యాసంగి కూడా అయిపోయింది కానీ వానాకాలం సీజన్ బియ్యం లక్ష్యం మాత్రం పూర్తి కాలేదు. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా సూర్యాపేట జిల్లా పెట్టాల్సి ఉండగా ద్వితీయస్థానంలో యాదాద్రి భువనగిరి, నల్గొండ మూడో స్థానంలో ఉన్నాయి. ఇక యాసంగి విషయానికి వస్తే ఈనెల 18నాటికి వచ్చిన లెక్కల ప్రకారం నల్గొండ జిల్లా నుంచి 23 శాతం సీఎంఆర్ బియ్యం వసూలు కాగా, సూర్యాపేట జిల్లా 5 శాతం మాత్రమే ఇచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా 26 శాతం సీఎంఆర్ బియ్యం పెట్టింది. మళ్లీ తాజాగా వానాకాలం ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయి.

రూ.కోట్ల బకాయిలు ఉమ్మడి జిల్లాలోనే:

ఉమ్మడి జిల్లాలో అత్యధిక సీఎంఆర్ బియ్యం బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఇప్పటి వరకు అనేక వాయిదాలు ఇచ్చినా నేటికీ మిల్లర్లు చెల్లించలేదు. కొందరు మిల్లర్లు ఉద్దేశపూర్వకంగానే సీఎంఆర్ బియ్యం పెట్టడం లేదని మిల్లర్ల వర్గాలే చెబుతున్నాయి. కొందరు వ్యాపారులు, అధికారులు చెబుతున్న దాని ప్రకారం, అసెంబ్లీలో చర్చించిన దాని ప్రకారం బకాయిదారుల వద్ద అసలు ధాన్యమే లేదని, వారు తమ అవసరాలకు ఎప్పుడో వాడుకున్నారని చెబుతున్నారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వం ఏ విధంగా బకాయిలను వసూలు చేస్తుందోనని అందరిలో ఆసక్తి నెలకొంది.

## అటవీ సంరక్షణ.. పక్కాగా పర్యవేక్షణ

పాల్వంచ : దట్టమైన అటవీ ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనుల పర్యవేక్షణపై సందేహాలు తలెత్తుతుంటాయి. అసలు పని జరుగుతోందా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతుంటాయి. ఒక్కోసారి కొందరు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారం ఇచ్చారా? అనే సందేహాల్ని ఉన్నతాధికారులు సమీక్షల్లో వ్యక్తం చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. ఇలాంటి పరిణామాలకు చెక్ పెట్టేందుకు, ప్రతి ఉద్యోగిపై పర్యవేక్షణ పకడ్బందీగా కొనసాగించేందుకు అటవీ శాఖ సంస్కరణలు చేపడుతోంది. ఇందులో భాగంగా 'వన సంరక్షణ్' యాప్‌ను తాజాగా ప్రవేశపెట్టింది. భద్రాద్రి సర్కిల్‌లోని భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఫలితాలను పరిశీలిస్తున్నారు. అటవీ ఆస్తుల పర్యవేక్షణ, అభివృద్ధి పనులు, అధికారుల విధుల పరిశీలన సమాచారం ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు చేరుతుంది. యాప్ నిర్వహణపై ఉద్యోగులందరికీ ఇటీవల శిక్షణ పూర్తిచేశారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు అందరి స్మార్ట్‌ఫోన్లలో యాప్‌ను డౌన్లోడ్ చేయించారు. ఒక్కొక్కరికీ ఒక గుర్తింపు సంఖ్య (ఐడీ), పాస్‌వర్డ్ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో విధులకు వెళ్లినప్పుడు స్థానిక చిత్రాలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వివరాలు పొందుపరచాలి. పనుల పరిశీలనకు వెళ్తే తాజా పురోగతిని వివరించాలి. తమ పరిధిలోని అటవీ ఆస్తులు, ఇతర నిర్మాణాలు, నీటి గుంతలు వంటి సమస్త సమాచారం నిక్షిప్తం చేశారు. సందర్శన సమయంలో కనిపించిన వన్యప్రాణులు ఫొటోలు తీసి పంపాలి. యాప్ సాయంతో ఉన్నతాధికారులు స్థానిక అధికారుల పనితీరును పర్యవేక్షిస్తున్నారు. ఏ అధికారి ఎక్కడ? ఎన్ని కిలోమీటర్లు తిరిగారో కూడా తెలుసుకోవచ్చు. క్షేత్రస్థాయికి వెళ్లని వారెవరో తెలుస్తుంది. ఒకవేళ తప్పుదోవ పట్టించే సమాచారం ఇచ్చినట్లు తేలితే నోటీసులు సైతం ఇస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో, ముఖ్యంగా ఆక్రమణకు గురయ్యే అటవీ ప్రాంతాల బీట్ అధికారులను అప్రమత్తం చేసేందుకు యాప్ ఉపకరిస్తోంది.

ఇదీ.. సంగతి

భద్రాద్రి జిల్లాలో మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ టెరిటోరియల్, భద్రాచలం, కిన్నెరసాని వైల్డ్‌లైఫ్ డివిజన్లు ఉన్నాయి. రేంజ్‌ల సంఖ్య 23. ఉద్యోగులు 637 మంది పనిచేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో కారేపల్లి, మధిర, కూసుమంచి, తల్లాడ, ఖమ్మం సహా 8 రేంజ్‌లున్నాయి. ఉద్యోగుల సంఖ్య.. సుమారు 340.

కొత్తవారికి దిక్సూచిబదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లిన కొత్త ఉద్యోగులకు బీట్ పరిధిలోని ఆస్తులు, ప్రాంతాలు, పనుల వివరాలను యాప్ సాయంతో సులభంగా తెలుసుకోవచ్చు. గతంలో క్షేత్రస్థాయికి వెళ్లి తెలుసుకునేందుకు చాలా రోజుల సమయం పట్టేది. ముందుగానే సమస్త సమాచారం అరచేతిలో ఇమిడి ఉన్నందున.. గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం (జీపీఎస్) ద్వారా నేరుగా లక్షిత ప్రదేశానికి చేరుకునే వీలు కలుగుతోంది.

# చలానాలపై రాయితీ.. చెల్లిస్తే మేలు



సిరిసిల్ల : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై పోలీసులు ఎప్పటికప్పుడు చలానాలు విధిస్తున్నారు. వీటిని చెల్లించకపోవడంతో బకాయిలు భారీగా పెరిగిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం వాహనాల వారీగా రాయితీలు ప్రకటించింది. మంగళవారం నుంచి అమల్లోకి రావడంతో ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతోపాటు వాహనదారులకు చలానాల భారం తగ్గనుంది. కారు నడుపుతున్నపుడు సీటు బెల్టు పెట్టుకోకపోవడం, ద్విచక్ర వాహనంపై హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, చరవాణిలో మాట్లాడటం, పరిమితికి మించి కూర్చుని వెళున్న వారిని చూసి పోలీసులు సెల్‌ఫోన్‌లోనూ, సీసీ కెమెరాల్లోని చిత్రాల ఆధారంగా జరిమానాలు విధిస్తున్నారు. ఇవి ఈ-చలానా రూపంలో సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తున్నాయి. జిల్లా పరిధిలో జనవరి నుంచి డిసెంబరు వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నవారు ఏకంగా 75 వేలకు పైగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పెండింగ్ చలానా రూపంలో చెల్లించాల్సిన మొత్తం రూ.కోటి పైనే ఉంది.

హెల్మెట్ లేకుండా నడిపినవే ఎక్కువ

జిల్లా పరిధిలో జాతీయ రహదారులు లేవు. ఉన్న రాష్ట్ర రహదారుల పరిధి తక్కువే. గ్రామీణ ప్రాంతాల రహదారులే ఎక్కువగా ఉంటాయి. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాటిలో హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపినవే ఎక్కువగా ఉన్నాయి. సుమారు 69 వేల వాహనాలపై ఈ-చలానాలు ఉన్నాయి. గతేడాది మార్చిలో అప్పటి ప్రభుత్వం రాయితీ ప్రకటించగా తక్కువ మంది మాత్రమే అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ, సీటు బెల్టు లేకుండా వాహనం నడిపిన వారిపైనా చలానాలు ఎక్కువే ఉన్నాయి. సిరిసిల్ల పట్టణంలో ప్రధాన కూడళ్లలోని సీసీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ గదికి అనుసంధానమై ఉన్నాయి. వీటిని నిత్యం పరిశీలించే సిబ్బంది ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా వెళ్లేవారు, కారులో వెళ్లేవారు సీటు బెల్టు లేకుండా ఉన్నవారికి, చరవాణిలో ఫొటోలు తీసి ఈ-చలానా విధిస్తున్నారు. ఇలా నమోదైనవే ఎక్కువగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఏడాదిలో జరిమానాల రూపంలో సుమారు రూ. 1.56 కోట్ల వరకు ఉంది. కొందరు జరిమానాలు చెల్లించకుండా ఎక్కువ మొత్తంలో ఉన్నవారు పట్టుబడిన సందర్భంలో పోలీసులు వారి వాహనాలను స్వాధీనం చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులకు 80 శాతం, ఆర్టీసీ, తోపుడు బండ్లకు 90 శాతం, నాలుగు చక్రాల వాహనాలకు 60 శాతం, భారీ వాహనాలకు 50 శాతం రాయితీ ఉంది. ఉదాహరణకు ద్విచక్ర వాహనదారుడిపై ఈ-చలానా వెయ్యి రూపాయలు ఉంటే అందులో రూ.200 చెల్లిస్తే సరిపోతుంది. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వాహనదారులు వినియోగించుకుంటే వాహనదారులకు భారం తగ్గడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.

# నీరు లేక.. అంతంతే ఏరువాక



నల్గొండ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ రంగం ఈ ఏడాది ఒడిదొడుకుల మధ్య సాగింది. రాష్ట్రంలోనే ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే అత్యధికంగా వరి, పత్తి పంటలు సాగవుతున్నాయి. అయితే ఈ ఏడాది ఉమ్మడి జిల్లా సాగుకు ఆయువుపట్టు అయిన కృష్ణా పరివాహకంలో నీటి ప్రవాహం లేకపోవడం, రెండు రాష్ట్రాల వరప్రదాయిని అయిన నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో నల్గొండ, సూర్యాపేట జిల్లాలోని ఎడమ కాల్వ కింద ఉన్న సుమారు 3.5 లక్షల ఎకరాల ఆయకట్టు బీళ్లుగా మారనున్నాయి. మరోవైపు ఈ ఏడాది వేసవిలో దాదాపు వారం రోజుల పాటూ అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చిన ధాన్యం తడిసి ముద్దయింది. చాలా చోట్ల వరదకు వడ్లు కొట్టుకుపోయాయి.

సగానికి తగ్గిన సాగు

అనావృష్టి పరిస్థితులు, అకాల వర్షాలతో ప్రధాన పంటలయిన వరి, పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గత ఆరేళ్లుగా వరుసగా 11 పంటలకు నాగార్జునసాగర్ నుంచి ఎడమ కాల్వ ఆయకట్టుతో పాటూ ఎస్ఎల్‌బీసీ ఆయకట్టు, చెరువుల కింద గరిష్ఠ స్థాయిలో వరి పంట సాగవగా.. ఈ ఏడాది ఎగువ నుంచి వరద లేకపోవడం, స్థానికంగానూ లోటు వర్షపాతం నమోదవడంతో వరి, పత్తి సాగు వైపు రైతులు మొగ్గు చూపలేదు. గతేడాది వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11.3 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవగా.. ఈ ఏడాది వానాకాలంలో అది 9.1 లక్షల ఎకరాలకు చేరింది. సుమారు 2.2 లక్షల ఎకరాల వరి సాగు తగ్గింది.

ఈ ఏడాది వేసవిలో వరి కోతలు, కొనుగోళ్ల సమయంలో వారం రోజుల పాటూ అకాల వర్షాలు కురవగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.20 కోట్ల మేర ధాన్యం తడిసి పాడయిందని సంబంధిత అధికార వర్గాల ద్వారా తెలిసింది. మరో 10 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. పంటల బీమా పథకం లేకపోవడంతో రైతుకు ఒక్క రూపాయి బీమా దక్కని పరిస్థితి. మరోవైపు పత్తి సాగు సైతం గతేడాదితో పోలిస్తే తగ్గింది. సరైన సమయాల్లో వర్షాలు లేకపోవడం, చీడపీడల బెడదతో దిగుబడులు అమాంతంగా పడిపోయాయి. గతేడాది 10.5 లక్షల ఎకరాల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి పంటను రైతులు సాగు చేయగా...ఈ ఏడాది అది 8.5 లక్షల ఎకరాలకు తగ్గింది. దిగుబడి గతంలో ఎకరాకు హీనపక్షం 4 క్వింటాళ్లు రాగా..ఈ ఏడాది అది 2.5 క్వింటాళ్లకు పడిపోయింది. కొన్ని చోట్లా పెట్టుబడీ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

గత యాసంగిలో ఎడమ కాల్వ పరిధి ఆయకట్టుతో పాటూ ఎస్ఎల్‌బీసీ, చెరువులు, కుంటలు, బోరు బావుల కింద 11 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఈ ఏడాది డిసెంబరు 20 వరకు అది కేవలం 48 వేల ఎకరాలకు పడిపోయింది. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల లేదని, ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లన్నీ తాగునీటి అవసరాలకేనని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో ఆయకట్టు భూములు ఈ యాసంగిలో ఏ పంట లేకుండా బీళ్లుగా ఉండనున్నాయి.

కాల్వలు, చిన్ననీటి వనరుల్లో నీటి నిల్వలు అడుగంటడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా భూగర్భజలాలు పడిపోయాయి. నల్గొండలో అత్యధికంగా 7.61 మీటర్ల లోతుకు నీటి నిల్వలు పడిపోగా.. సూర్యాపేటలో అది 5.33 మీటర్లు, యాదాద్రిలో 5.40 మీటర్లుగా ఉంది.

రెండేళ్ల క్రితం వరకు దేవరకొండ, చందంపేట, నేరేడుగొమ్ము, పీఏ పల్లి, పెద్దవూర, చింతపల్లి లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లో 30 వేల ఎకరాలకు పైగా వేరుశనగ పంటను పండించిన రైతులు ఈ ఏడాది అది 5 వేల ఎకరాలకు పడిపోయింది. వేరుశనగ దిగుబడులతో రెండేళ్ల క్రితం దేవరకొండ రైతులు రూ.500 కోట్ల వరకు ఆర్జించడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు సృష్టించింది.


గతంతో పోలిస్తే నకిలీ విత్తనాల బెడద తగ్గగా..దేవరకొండ సబ్‌డివిజన్ పరిధిలో ఇంకా అక్కడక్కడా పలు ఘటనలు వెలుగుచూస్తున్నాయి. అయితే ఈ ఏడాది పోలీసులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేయడంతో రైతులకు కొంత మేర వీటి బెడద తగ్గింది.

గత ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4 లక్షలకు పైగా రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంట పెట్టుబడులు సైతం సకాలంలో అందలేదు. సన్నధాన్యానికి ఈ ఏడాది డిమాండ్ బాగా పెరిగింది. మిర్యాలగూడ, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, కోదాడ లాంటి ఆయకట్టు ప్రాంతాలతో పాటూ నాన్ ఆయకట్టు ప్రాంతాల్లో పండిన సన్నధాన్యాన్ని మిల్లర్లు క్వింటాకు రూ. 2800 నుంచి రూ. 3200 వరకు కొనుగోలు చేశారు. గతేడాది గరిష్ఠంగా రూ.2800 పలకగా... ఈ ఏడాది అక్కడి నుంచే ప్రారంభం కావడంతో రైతులకు కొంత ఆర్థికంగా లబ్ధి చేకూరింది. ఉమ్మడి జిల్లాలో అపరాల సాగు ప్రస్తావనే లేకుండా పోయింది. ఆయకట్టులో వరి కాకుండా ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు సంబంధిత అధికారులు రైతులను ప్రోత్సహించకపోవడంతో పప్పుధాన్యాలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి, సూర్యాపేట, దేవరకొండ లాంటి ప్రాంతాల్లో పెసర, మినుము పంటను గతంలో 10 వేల ఎకరాలకు పైగా సాగు చేసేవారు. అది ఇప్పుడు రెండు వేల ఎకరాలకు పడిపోయింది.

# రూ.251 కోట్ల చెరువు!

హైదరాబాద్: దేశంలో మరెక్కడా లేనిరీతిలో.. మల్కారం చెరువు నీటి శుద్ధి పనులు కొనసాగుతున్నాయి. లక్షలాది లీటర్ల మురుగునీటిని శుద్ధి జలంగా మార్చడంలో ఇంజినీర్లు పురోగతి సాధిస్తున్నారు. ఒప్పందం ప్రకారం.. ఇప్పటికే ప్రాజెక్టు పూర్తవ్వాలి. వేర్వేరు కారణాలతో జాప్యంత లెత్తింది. కనీసం.. రాబోయే వర్షాకాలంలోనైనా నీటి శుద్ధి ప్రాజెక్టు పూర్తవ్వాలన్నది డంపింగ్‌యార్డు చుట్టుపక్కల గ్రామాల వారి ఆకాంక్ష. దీంతో భూగర్భ జలం, వాతావరణ కాలుష్యం కొంతైనా అదుపులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గాఢ మురుగుజలం..డంపింగ్‌యార్డులో లక్షలాది టన్నుల చెత్తకుప్పలున్నాయి. వర్షం వచ్చినప్పుడు.. ఆ వ్యర్థాల్లోంచి వచ్చే మురుగు నీరంతా.. కొన్నేళ్లుగా పక్కనున్న మల్కారం చెరువులో నిల్వ ఉంటోంది. ఎండాకాలం కూడా ఆ చెరువు ఎండిపోవట్లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అటుగా వెళ్తే.. ముక్కుపుటాలు అదిరిపోయేంతా దుర్వాసన వెలువడుతోంది. చెరువులోని నీటి కాఠిన్యత నానాటికీ పెరుగుతుండటంతో.. సర్కారు మురుగు నీటి శుద్ధి ప్రక్రియకు నడుం బిగించింది.



భారీ వ్యయమే ఓ విశేషం..మల్కారం చెరువులోని మురుగునీటి శుద్ధికి అనేక ప్రత్యేకతలున్నాయి. ప్రాజెక్టు భారీ వ్యయం మొదటిది. కొత్త సాంకేతికతతో శుద్ధి చేయాలంటూ జీహెచ్ఎంసీ ఇంజినీర్లు రూ.251కోట్లతో అంచనాలు సిద్ధం చేశారు. ఓ ప్రైవేటు సంస్థ పనులు దక్కించుకుంది. రెండేళ్ల కిందట నీటిశుద్ధి కేంద్రం ప్రారంభమైంది. ఎంవీఆర్ఈ(మెకానికల్ వాపర్ రీ కంప్రెషన్) పద్ధతిలో నీటిని శుభ్రం చేస్తున్నారు.

# దండిగా రామగుండం యూరియా

ఖమ్మం : ఖమ్మం రైల్వే స్టేషన్ రేక్ పాయింట్‌కు రామగుండం నుంచి దండిగా యూరియా చేరింది. ఆర్ఎఫ్ఎల్ కంపెనీకి చెందిన 3 వేల మెట్రిక్ టన్నుల యూరియాను మూడు జిల్లాలకు సరఫరా చేశారు. ఖమ్మం జిల్లాకు 1370 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి కొత్తగూడెం 580, మహబూబాబాద్‌కు 900 మెట్రిక్ టన్నులను కేటాయించారు. కమిషనర్ రెగ్యులర్ పూల్‌లో 150 మెట్రిక్ టన్నులను ఉంచారు. ప్రస్తుతం సీజన్ పెద్దగా లేకపోవటంతో అధిక శాతం మార్క్‌ఫెడ్‌లోనే నిల్వ ఉంచారు. ఖమ్మం జిల్లాలో యాసంగిలో మొక్కజొన్న ఎక్కువగా సాగు చేసే మండలాలైన కొణిజర్ల, చింతకాని, బోనకల్లు, కూసుమంచి,



ముదిగొండ తదితర మండలాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సరఫరా చేశారు. కొద్ది రోజుల నుంచి వివిధ కంపెనీలకు చెందిన ఎరువులు ఖమ్మం రేక్ పాయింట్‌కు చేరుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు ముందస్తుగా తెప్పించి ఎరువులను నిల్వ ఉంచుతున్నారు. సీజన్‌లో ఎలాంటి కొరత రాకుండా ఉండేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ఇంత పెద్ద ఎత్తున యూరియా నిల్వలు జిల్లా రేక్ పాయింట్‌కు రావటం ఇదే మొదటిసారి కావటం విశేషం. ప్రస్తుతం యాసంగి సీజన్‌కు అవసరమైన ఎరువులు సమృద్ధిగా నిల్వ ఉండటంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# అమ్మకు అండగా..

కొత్తగూడెం : ఉభయ జిల్లాల్లో మాతృ మరణాల నివారణపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్యారోగ్య శాఖ సిబ్బందిని ప్రోత్సహిస్తున్నారు. ఇదే సమయంలో మాతృ మరణాలు సంభవించకుండా చూడాలని సమీక్షల్లో ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో గత ఏడాదితో పోల్చిచూస్తే ఈసారి మాతృ మరణాల సంఖ్య కొంత తగ్గుముఖం పట్టింది. 2022లో ఉభయ జిల్లాల్లో 20 మాతృ మరణాలు సంభవించాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏడు ఘటనలు చోటుచేసుకున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు మరణాలు సంభవించగా.. అవి పర్ణశాల, దుమ్ముగూడెం, అశ్వారావుపేట ఆరోగ్య కేంద్రాల పరిధిలో నమోదయ్యాయి. ఇలాంటి ఘటనలు 'సున్నా' శాతానికి తగ్గించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు సమీక్షల్లో స్పష్టం చేస్తున్నారు. ప్రత్యేక శిక్షణ పొందిన మిడ్‌వైఫరీ సిబ్బందితో పాటు క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తల సేవలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రం పరిధిలో గర్భిణుల నమోదు ప్రక్రియలో లోపాలు లేకుండా వైద్యాధికారులు జాగ్రత్తలు చేపడుతున్నారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సబ్ సెంటర్ల పరిధిలో హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, వారికి వైద్య పరీక్షలు చేయించడంపై దృష్టిసారించారు. ఫలితంగా ఈ ఏడాది ఉభయ జిల్లాల్లో మాతృ మరణాలు సగానికి తగ్గాయి.

పోషకాహార కిట్లతో మేలు

గర్భిణుల్లో హైరిస్క్‌కు దారితీసే ప్రధాన కారణాల్లో రక్తహీనత ఒకటి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లు అందజేస్తోంది. దీనికి తోడు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ పోషకాహారాన్ని తీసుకునేలా నిర్వాహకులు చొరవ తీసుకుంటున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి హై రిస్క్ ఉన్నవారిని గుర్తిస్తున్నారు. వారికి నెలనెలా వైద్య చికిత్సలు, పరీక్షలు చేయిస్తున్నారు. ప్రసవ తేదీ కంటే ముందే ఆసుపత్రుల్లో చేర్పిస్తుండటంతో మాతా, శిశు సంరక్షణ సాధ్యమవుతోందని వైద్యాధికారులు చెబుతున్నారు. ముమ్ముందూ ఆయా చర్యలు పకడ్బందీగా కొనసాగించాలని ఉన్నతాధికారులు తాజాగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

'హైరిస్క్‌లో ఉన్న గర్భిణుల ఆరోగ్య సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలి. వైద్య నిపుణులు సూచించిన అన్ని రకాల వైద్య పరీక్షలు సకాలంలో చేయించాలి. పరిస్థితి విషమించే వరకు వేచిచూడకుండా అప్రమత్తం చేయాల్సిన బాధ్యత వైద్యారోగ్య శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిదే. ప్రతిదానికీ పైఆసుపత్రికి రిఫరల్ చేసే సంస్కృతిని విడనాడుదాం.' ప్రియాంక అల, భద్రాద్రి జిల్లా కలెక్టర్

# మిల్లర్లు అప్పగించిందే లెక్క!

నిర్మల్ : గతేడాది వానాకాలం, యాసంగి సీజన్‌లలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ప్రక్రియలో జాప్యం జరుగుతూనే ఉంది. ఈ బియ్యం సేకరణకు మరో మూడు రోజుల గడువు మాత్రమే ఉన్నా ఇప్పటికీ పూర్తి చేయలేకపోయారు. సంబంధితశాఖ అధికారుల ఉదాసీనత కారణంగానే మిల్లర్లు ఆడిందే ఆటగా మారుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. మిల్లర్లు అప్పగించిందే లెక్క అన్నట్లు వ్యవహరిస్తున్న తీరు సీఎంఆర్ గణాంకాలు చూస్తే స్పష్టమవుతోంది. ధాన్యంతో వ్యాపారం..జిల్లాలో సీఎంఆర్ విషయంలో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. కస్టం మిల్లింగ్ కింద మర ఆడించిన బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పంపిస్తారు. బియ్యానికి సంబంధించిన డబ్బులను ఎఫ్‌సీఐ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు జమచేస్తోంది. ఎఫ్‌సీఐ రాయితీపై ప్రజా పంపిణీకి అవసరమైన బియ్యాన్ని సరఫరా చేస్తుంది. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకున్న మిల్లు నిర్వాహకులు 15 రోజుల్లో మర ఆడించి బియ్యాన్ని అప్పగించాలి. కానీ కొందరు ఈ ధాన్యంతో వ్యాపారం చేస్తున్నారు. మర ఆడించకుండానే ధాన్యాన్ని మహారాష్ట్రకు తరలించి విక్రయిస్తుండగా.. మరికొందరు బియ్యంగా మార్చి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. పైసా పెట్టుబడి లేకుండా అక్రమ దందా సాగిస్తున్నారు. బియ్యం అప్పగించా లని అధికారులు ఒత్తిడి తెచ్చినప్పుడు పీడీఎస్ బియ్యాన్ని సేకరించి సీఎంఆర్ కింద అప్పగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. అక్రమ బియ్యం దందా కొనసాగించే వారి వద్ద పీడీఎస్ బియ్యాన్ని కిలో రూ.12 నుంచి రూ.15కి కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పజెబుతున్నారు. సీజన్‌లో కొందరు మిల్లుల విద్యుత్తు బిల్లులు పరిశీలిస్తే ఈ అక్రమ దందా వ్యవహారం బయటపడుతుంది. నాణ్యత లేని బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పంపిస్తున్నా.. ఎవరూ అడ్డుచెప్పడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది విజిలెన్స్ అధికారులు జిల్లాలోని పలు మిల్లుల్లో తనిఖీలు చేపట్టడంతో.. సీఎంఆర్ ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు వెల్లడైంది. సిండికేట్‌గా మారడంతోనే..కొన్నేళ్ల నుంచి సిండికేట్‌గా ఏర్పడిన ధాన్యం సేకరణ మొదలుకుని సీఎంఆర్ తిరిగి వచ్చేవరకు మిల్లర్లు పెద్దఎత్తున చక్రం తిప్పుతున్నట్లు చూపిన లెక్కలు చూస్తే స్పష్టమవుతోంది.

# అక్రమ లేఅవుట్లకు అడ్డుకట్ట పడేనా!

కోరుట్ల : నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా, అక్రమంగా వెలుస్తున్న లేఅవుట్లపై అధికారుల నిఘా కరవైంది. అన్ని ధ్రువపత్రాలు ఉండి ఇంటి అనుమతి కోసం అధికారుల చుట్టూ తిరిగినా అనుమతి ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తారు. పంచాయతీ పరిధిలో వెలుస్తున్న అనుమతి లేని లేఅవుట్లలో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి అనుమతులు ఇవ్వడం అలసత్వనికి నిదర్శంగా నిలుస్తోంది. ఎలాంటి అనుమతులు లేని లేఅవుట్ స్థలంలో ఓ పంచాయతీ కార్యదర్శి ఏకంగా 50 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం గమనార్హం. దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ మండల అధికారి కార్యదర్శికి మెమో జారీ చేయడం ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పరిశీలనపై నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

నిబంధనలు బేఖాతరు

ఎకరం స్థలంలో లేఅవుట్ ఏర్పాటు చేయాలంటే 40 అడుగుల రహదారి, 30 అడుగుల అంతర్గత రహదారి 10 శాతం పంచాయతీ పేరిట రిజర్వ్ స్థలం కేటాయించాల్సి ఉంటుంది. లేఅవుట్ రుసుం, మార్పిడి, కాలువలు, వీధి దీపాలు, అంతర్గత పైపులైన్లు, రహదారుల అభివృద్ధితో పాటు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అన్ని ఉంటేనే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది.

లేఅవుట్లకు డీటీసీపీ అనుమతి ఉండి, అభివృద్ధి పనులు జరిగి బ్లూప్రింటు ఉంటే ఇంటి నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కోరుట్ల మండలం కల్లూర్ గ్రామ శివారులోని లేఅవుట్లలో డీటీసీపీ అనుమతి లేకుండా ఏకంగా 50 ఇంటి నిర్మాణాలకు పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇచ్చారు. దీనిపై మండల అధికారి కార్యదర్శిని నిలదీశారు. దీనిపై పొంతన



లేని సమాధానలు ఇవ్వడంతో మెమో జారీ చేశారు.

కార్యదర్శికి మెమో జారీ చేశాం- నీరజ, కోరుట్ల ఎంపీవో

కల్లూర్ గ్రామపంచాయతీ పరిధిలో డీటీసీపీ అనుమతులు లేకుండా లేఅవుట్ చేసి ఇళ్లు నిర్మిస్తున్నా ఉన్నతాధికారుల దృష్టికి తేకుండా, ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడంపై పంచాయతీ కార్యదర్శి వివరణ కోరుతూ మెమో జారీ చేశాం. కార్యదర్శి వివరణ ఇవ్వకపోతే తగు చర్యలు తీసుకుంటాం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం- శ్రీనివాస్‌రావు, జిల్లా డీటీసీపీవో

డీటీసీపీ అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టడం మా దృష్టికి రాలేదు. కార్యదర్శి, ఎంపీవో సమక్షంలో పరిశీలన చేసి డీటీసీపీ అనుమతులు లేకుండా ఉంటే తగు చర్యలు తీసుకుంటాం. అనుమతులు ఉన్న వాటినే కొనుగోలు చేయాలి.

# అర్ధరాత్రి ఇంధన కష్టాలు

జగిత్యాల : జిల్లాలో మొత్తం 106 పెట్రోల్ బంకులు ఉన్నా అర్ధరాత్రి వేళల్లో కనీసం ఒక్కటి కూడా అందుబాటులో ఉండటం లేదు. ఏళ్ల నుంచి ఇదే కొనసాగుతున్నా, పట్టించుకునేవారు కరవయ్యారు. దీంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 24 గంటలు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికీ రాత్రి 11 దాటిన తరువాత మూసివేస్తున్నారు. అత్యవసరమైన సందర్భాల్లోనూ ఇంధనం లభించడం లేదని వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాలు, మండలాలతో పాటు, జిల్లా కేంద్రంలోనూ ఇదే దుస్థితి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సైతం ఇంధన కష్టాలు తప్పడం లేదు.

సౌకర్యాలు అంతంతే

రాత్రి పూట 10 గంటల తరువాత భద్రత కారణాలతో బంకులు మూసి ఉంచుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారని వాహనదారులు చెబుతున్నారు. క్యూఆర్ కోడ్, యాప్‌ల ద్వారా క్యాష్‌లెస్ సేవలు అందించే అవకాశం ఉన్నప్పటికీ, ఇంధనం పోసేందుకు నిరాకరించడం వినియోగదారులకు సేవా లోపమేని ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రం, పట్టణాలు, మండలాల వారీగా, రాత్రి వేళల్లో కనీసం ఒక్క



బంకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పెట్రోల్ బంకుల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల టైర్లకు గాలి నింపే సౌకర్యం తదితరాలను కచ్చితంగా అందుబాటులో ఉంచాలి. నగదు అవసరం లేకుండా క్యూఆర్ కోడు ఆధారంగా క్యాష్‌లెస్ విషయంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. అంతర్జాలం సక్రమంగా పనిచేయకపోవడం, తమ ఖాతా నుంచి నగదు బదిలీ అయినప్పటికీ, పెట్రోల్‌బంకు ఖాతాలోకి చేరలేదనే ఘటనలతో తరచూ ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం: సి.వెంకటేశ్, డీసీఎస్‌వో

ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనదారులకు ఇబ్బందులు ఎదురవకుండా బంకుల నిర్వాహకులు సేవలు అందించాల్సిందే. ఈ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. ప్రభుత్వ నిబంధనలు అమలు చేసే విధంగా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటాం. పెట్రోల్ బంకుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి వాహనదారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

# గనులకు వేలం.. అక్రమాలకు కళ్లెం



తాండూరు : ఖనిజ నిక్షేపాల గనులను వేలం ద్వారా కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ప్రారంభించింది. రాష్ట్రంలోనూ వేలం కార్యాచరణ మొదలు పెట్టాలంటూ కేంద్ర గనుల శాఖ కార్యదర్శి వి.లక్ష్మీకాంతారావు తాజాగా రాష్ట్ర స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో వందల ఎకరాల్లో నాపరాయి, సున్నపురాయి గనులున్న తాండూరు మండలాన్ని కూడా సందర్శించారు. గనుల వేలంపై దృష్టిసారించినట్లు ఆయన తెలిపారు. గనుల కేటాయింపులతో అక్రమాలకు అడ్డుకట్ట పడటంతోపాటు రాష్ట్ర ఖజనాకు ఆదాయం సమకూరుతుంది.

అనుమతులు లేకుండా యథేచ్ఛగా తవ్వకాలు

జిల్లాలో తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో 5992 ఎకరాల విస్తీర్ణంలో ఖనిజ సంపదతోకూడిన నేలలున్నాయి. సున్నపురాయి, సుద్ద, నాపరాయి, ఇసుక, ఎర్రకంకర, నల్లకంకర, పలుగురాళ్లు, ఎర్రమట్టి వంటి నిక్షేపాలున్నాయి. వీటిని తవ్వకాలతో వెలికి తీసేందుకు గనులు భూగర్భ వనరుల శాఖ, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, అటవీ, పర్యావరణ, నీటి పారుదల శాఖల నిరభ్యంతర పత్రాలు పొందితే సర్కారు లీజు మంజూరు చేస్తోంది. దీంతో ఆయా లీజుదారులు ప్రభుత్వానికి రుసుం, డెడ్ రెంట్‌లను చెల్లించడం ద్వారా ఆదాయం లభిస్తోంది. ఈక్రమంలో కొందరు ఎలాంటి అనుమతులు పొందకుండానే అక్రమంగా ఖనిజ సంపదను తవ్వుకుపోతున్నారు. సర్కారు ఆదాయానికి గండికొడుతున్నారు. మల్కాపూర్‌లో సర్వే సంఖ్య 116, 15లోని ప్రభుత్వ భూముల్లో, కరణ్‌కోట శివారు సర్వే సంఖ్య 2, ఓగీపూర్‌లోని 129 సర్వే సంఖ్యలోని సర్కారు భూముల్లో ఇష్టానుసారంగా తవ్వకాలు సాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలను ప్రభుత్వం ఇతర శాఖలకు మళ్లించడం, గనుల శాఖలో ఖాళీలతో సిబ్బంది కొరత కారణంగా విలువైన ఖనిజ సంపదతోకూడిన ప్రభుత్వ భూములపై నిఘా కొరవడింది. దందా సాఫీగా సాగేందుకు దోహదపడుతోంది.

నూతన పద్ధతితో పెరిగే ఆదాయం

లీజు ద్వారా గనులను కట్టబెట్టే విధానానికి స్వస్తి పలికి వేలం ద్వారా గనుల అప్పగించే నూతన విధానానికి కేంద్ర సర్కారు సన్నాహాలు చేసింది. ప్రభుత్వ భూముల్లో నిక్షేపాల తవ్వకాలకు వేలం నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఎక్కువ సొమ్ము చెల్లించిన వ్యాపారులకు గనులను కట్టబెట్టనున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి అధిక ఆదాయం దక్కే వీలుంది.

ఖనిజ నిక్షేపాలకు విలువ లెక్కింపు- శామ్యూల్ జాకబ్, ఏడీ, గనులు భూగర్భ వనరుల శాఖ.

ప్రస్తుత విధానంలో గనుల లీజుదారుల నుంచి కేవలం పన్ను మాత్రమే వసూలు చేస్తోంది. నూతనంగా అమలు చేసే విధానంతో ఖనిజ నిక్షేపాలకు విలువగట్టి వేలం నిర్వహిస్తుంది. దీంతో పన్నుతోపాటు అదనంగా నిక్షేపాల ఆదాయం సమకూరుతుంది. ఒడిశాలో ఇటీవల నిర్వహించిన వేలం ద్వారా రూ.40వేల కోట్ల ఆదాయం సమకూరింది.

# అవసరమైన పనులకే అనుమతి!



హైదరాబాద్: రాజధానిలో రూ.వేల కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్ష చేసిన తరువాతే వీటిపై తుది నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో ప్రాధాన్య క్రమ పనులకే అనుమతివ్వాలని, గంపగుత్త పనులు చేయకూడదని సర్కారు భావిస్తోంది. ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న పనులకు మాత్రం ఆమోద ముద్ర పడబోతోంది. కొద్దిరోజుల్లోనే బల్దియా, జలమండలి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేయబోతున్నారు. రహదారులు

రహదారుల అభివృద్ధికి మొదటి, రెండు దశల్లో దాదాపు రూ.5500 కోట్ల పనులు చేపట్టారు. పూర్తి చేయాలంటే మరో రూ.1600 కోట్లు అవసరం. అవి లేక చాలాచోట్ల పనులాగిపోయాయి. మూడోదశకు రూ.5 వేల కోట్ల అవసరం. దీంతో మూడోదశకు ఇప్పట్లో సర్కారు అనుమతిచ్చే అవకాశం లేదని అధికారులంటున్నారు.

నాలాల విస్తరణ

మొదటిదశలో రూ.925 కోట్లతో పనులను చేపట్టారు. నిధుల్లేక ఆగిపోయాయి. ఇంకా రూ.20 వేల కోట్లు అవసరం. నగరంలో రెండు సెం.మీ. వర్షం పడితే కాలనీలు మునిగిపోతున్న నేపథ్యంలో నాలాల విస్తరణపై దృష్టిసారించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మ్యానిఫెస్టోలో కూడా ఈ హామీ ఉంది.

మూసీపై వంతెనలు

ఈస్ట్-వెస్ట్ కారిడార్ పేరుతో రూ.5500 కోట్లతో మూసీపై వంతెన, ఇతర అభివృద్ధి పనులను ఆర్థిక పరిస్థితి కుదుటపడిన తరువాతే ప్రభుత్వం దృష్టి సారించనుంది. అందుకే రూ.545 కోట్లతో మూసీ నదిపై 15 బ్రిడ్జిల నిర్మాణానికి టెండర్లు పిలిచినా ఖరారు చేయలేదు. అవసరమైన చోటే నిర్మించాలని భావిస్తోంది.

జలమండలి: నిర్మాణంలో ఉన్న కొన్ని ప్రాజెక్టులను పూర్తి చేయనున్నారు. 31 మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణాలను మరో 6, 7 నెలల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. నాగార్జున సాగర్ నుంచి బ్యాక్ వాటర్‌ను తీసుకునే వీలుగా నిర్మాణంలో ఉన్న సుంకిశాల ప్రాజెక్టును పూర్తి చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. రూ.5 వేల కోట్లతో కేశవాపురం దగ్గర రిజర్వాయర్‌కు గత ప్రభుత్వం అనుకుంటే ప్రస్తుతం అవసరం లేదని ఉన్నతాధికారులంటున్నారు.

ఓఆర్‌ఆర్ చుట్టూ: 159 కి.మీ. రింగ్ మెయిన్ నిర్మాణం ఇప్పటివరకు 44 కి.మీ. పూర్తయింది. మిగిలిన పనులకు నిధుల్లేక పనులు మందగించాయి. ఇంకా రూ.2500 కోట్ల అవసరమని తేల్చారు. దీంతో ఈ ప్రాజెక్టు ముందుకెళ్లే అవకాశం లేదని అధికారులంటున్నారు.

మెట్రో కారిడార్: రాయదుర్గం నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి నిర్మించాల్సిన మెట్రో ప్రాజెక్టును ప్రభుత్వం ఇప్పటికే నిలిపివేసింది. ఎల్బీనగర్ నుంచి విమానాశ్రయానికి మెట్రో నిర్మించాలనుకుంటున్నారు. నాలుగైదు లైన్లకు సంబంధించి సర్వే పనులు జరుగుతున్నాయి. ఈ నివేదికలు వచ్చిన తరువాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.

# 57 బృందాలు.. 668 సభలు

వికారాబాద్ : సంక్షేమ పథకాల లబ్ధి, రేషన్ కార్డు పొందేందుకు ఇతర సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అర్హులకు ఆరు గ్యారంటీ పథకాలను అందించేందుకు నేటినుంచి 'ప్రజా పాలనకు' శ్రీకారం చుట్టింది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 57 బృందాలు ఏర్పాటు చేసింది. వినతులు విన్నవించేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. చివరితేదీ జనవరి 6.


స్పష్టత రావాల్సి ఉంది

పథకాలలబ్ధికి తెల్ల రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్లు అధికారులు వివరిస్తున్నారు. చాలా మందికి ప్రస్తుతం తెల్ల రేషన్ కార్డు లేదు. వీరి విషయంలో ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. గ్రామాలు, వార్డుల్లో ఉన్న కుటుంబాల సంఖ్య ఆధారంగా సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఇవీ జతచేయాల్సినవి

రకరకాల దరఖాస్తులు కాకుండా ప్రభుత్వమే ప్రత్యేకంగా దరఖాస్తు ఫారం రూపొందించింది. దీనికి దరఖాస్తుదారు ఫొటో, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోన్ నంబర్, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల నంబర్లు, గ్యాస్ కనెక్షన్ నంబర్, గ్యాస్ ఏజెన్సీ పేరు, పట్టాదారు పాసు పుస్తకం నంబర్, సర్వే నెంబర్, విస్తీర్ణం వివరాలు. వ్యవసాయ కూలీ అయితే జాబ్ కార్డు నంబర్, గృహ విద్యుత్ మీటర్ నంబర్ ఉండాలి. దివ్యాంగులైతే సదరం ధ్రువీకరణ నంబర్ తదితర వివరాలను తెలపాల్సి ఉంటుంది.

వేళలు ఇలా..ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2 నుంచి




సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నిత్యం రెండు గ్రామాలు, పట్టణాల్లోని రెండు వార్డుల్లో సభలు నిర్వహిస్తారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా వేర్వేరు చోట్ల సభలు జరుగుతాయి. గ్రామాల్లో మండల స్థాయి, పట్టణాల్లో వార్డుల సంఖ్యకు అనుగుణంగా అధికారుల బృందాలను నియమించారు.

కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు

దరఖాస్తులన్నింటినీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ రూపొందించిన ఆన్‌లైన్‌లో ఏ రోజుకారోజు ఉన్నతాధికారులకు పంపించనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు ముందు ఆ ఫారంలో ఆధార్, తెల్ల రేషన్ కార్డు తదితర అన్ని వివరాలను పరిశీలించి సరి చూసుకోవాలని అధికార బృందాలను ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకు రసీదుతో పాటు ప్రత్యేక సంఖ్యను కేటాయిస్తారు. మహిళలకు ప్రత్యేక కౌంటర్లు..మహిళల కోసం ప్రకటించిన పథకాలే అధికంగా ఉండటంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేపట్టారు. మహిళలకు కనీసం రెండు కౌంటర్లు, పురుషులకు ఒక కౌంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

# అన్నదాతకు భరోసా కరవు

పెద్దపల్లి : అటు నిర్వహణకు నిధుల కొరత.. ఇటు పర్యవేక్షణ లేకపోవడం.. వెరసి రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి.. పంటల సాగులో అన్నదాతకు అండగా నిలవాలన్న ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది.. పంటల సాగులో ఆధునిక సాంకేతికతను రైతుల దరి చేర్చేందుకు, మార్కెటింగ్ తదితర అంశాలపై సదస్సులు నిర్వహించేందుకు 2020లో నాటి భారాస ప్రభుత్వం రైతు వేదికలు నిర్మించింది. క్లస్టరుకు ఒక్కోటి చొప్పున నిర్మించిన వేదికకు గరిష్ఠంగా రూ.22 లక్షల వరకు వెచ్చించారు. ఉమ్మడి జిల్లాలో 258 రైతు వేదికల నిర్మాణానికి రూ.56.6 కోట్ల వరకు ఖర్చు చేశారు.

10 నెలలుగా నిలిచిన నిధులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 258 రైతు వేదికలకు ఒక్కో దానికి ప్రతి నెలా రూ.10 వేల వరకు నిర్వహణ ఖర్చులవుతున్నాయి. 2022 జనవరి నుంచి నెలకు రూ.10 వేల చొప్పున చెల్లించారు. ఈ ఏడాది మార్చి నుంచి నిధులు నిలిచిపోవడంతో కొన్ని చోట్ల వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈవోలు) సైతం నిర్వహణను పట్టించుకోవడం




లేదు. ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.25.8 కోట్ల మేర నిర్వహణ నిధులు రావాల్సి ఉంది. మండలకేంద్రాల్లో ఉన్న రైతు వేదికలు కొంతమేర సద్వినియోగమవుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు చెందిన సమావేశాలు, ఇతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక క్లస్టర్ల పరిధిలో ఉండే రైతు వేదికల తలుపులు ఏఈవోలు గ్రామానికి వస్తే మినహా తెరచుకోవడం లేదు.

కమిటీల రద్దుతో సందిగ్ధం

రాష్ట్రంలో గత భారాస ప్రభుత్వ హయాంలో రైతు సమన్వయ సమితులు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో రైతులను చైతన్యపరిచేందుకు ప్రతి పంచాయతీకి సమితి ఏర్పాటుతో పాటు మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేశారు. వీటికి అధ్యక్షుడితో పాటు 15 మందితో కూడిన కార్యవర్గాన్ని నియమించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు సమితులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో రైతువేదికల నిర్వహణపై సందేహాలు తలెత్తుతున్నాయి. వీటిని రైతుల అవసరాలకు వినియోగిస్తారా? ఇతర ప్రభుత్వ అవసరాలకు వాడతారా? అనేదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు.

# వృథాగా మిషన్ భగీరథ నీరు

జగిత్యాల : కోట్ల రూపాయలు వెచ్చించి ఇంటిటికీ శుద్ధజలం(మంచినీరు) అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం లక్ష్యం నెరవేరడం లేదు. కోరుట్ల పట్టణంలో సుమారు లక్ష మంది ప్రజలు నివసిస్తున్నారు. ప్రజలకు మంచినీరు అందించేందుకు రెండేళ్ల కిందట అర్బన్ మిషన్ భగీరథ పథకంలో పట్టణంలోని అన్ని కాలనీల్లో నూతనంగా ప్రధాన పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. అంతర్గత పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ ప్రత్యేక పైపులను అమర్చి కుళాయిలను బిగించి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ గుత్తేదారు గుత్తేదారు ఇంటింటికీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి బిగించిన కుళాయిని తొలగించడంతో నీరు వృథాగా పోతోంది.



పైపులను చాలాచోట్ల మురుగు కాలువలో, రోడ్లపై పడేస్తున్నారు. చాలాచోట్ల పైప్‌లైన్లకు పగుళ్లు వచ్చి లీకేజీలు ఏర్పడ్డాయి. పైపులను మురుగు కాలువలో వదిలేయడంతో మంచినీరు కలుషితమవుతోంది. పైపులకు అమర్చిన కుళాయిలను తొలగించడంతో రహదారులపై నిత్యం గంటల తరబడి నీరు ప్రవహించి బురదమయంగా మారడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. తారురోడ్లపై నీరు ప్రవహించడంతో దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఇళ్ల ముందున్న పైపులకు కుళాయిలను అమర్చి భగీరథ నీరు వృథాగా పోకుండా అరికట్టాల్సిన బల్దియా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

# అన్ని చోట్లా కరోనా పరీక్షలు

హైదరాబాద్: గ్రేటర్‌లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇటీవల ఉస్మానియాలో ఇతర అనారోగ్య సమస్యలతో చేరి పరిస్థితి విషమించడంతో ఇద్దరు మృతి చెందిన సంగతి తెలిసిందే. సాధారణ పరీక్షల్లో వీరికి కరోనా సోకినట్లు తేలింది. తాజాగా మరో మహిళా వైరస్ బారినపడి ఉస్మానియాలో చేరింది. ఈమెకు వారం కిందట కాలిన గాయాలయ్యాయి. ప్రస్తుతం ఈమెకు కరోనా నిర్ధారణ అయింది. గాంధీలో కూడా కొందరు చేరారు. న్యుమోనియాతో నిలోఫర్‌లో చేరిన ఓ చిన్నారికి బుధవారం కరోనా నిర్ధారణ అయింది. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నేపథ్యంలో టెస్టులు పెంచాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రణాళిక సిద్ధం చేస్తోంది.కార్యాచరణ షురూ..పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో ర్యాపిడ్, ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయాలని అధికారులు ఆదేశించారు. నగర వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో 20 వేల కిట్లు అందుబాటులో ఉంచినట్లు హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్ తెలిపారు. జేఎన్1 వేరియంట్ విషయంలో భయాందోళన అవసరం లేదని సూచిస్తున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే పరీక్షలు చేసుకొని పాజిటివ్‌గా తేలితే బయట తిరగకుండా ఇంట్లో ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

# మండు వేసవిలో నిండు కుండ

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు తర్వాత రెండో పెద్ద జలాశయంగా పేరున్న మూసీ రిజర్వాయర్ పూర్తిగా నిండింది. నల్గొండ జిల్లా కేతేపల్లి మండలంలో ఉన్న రిజర్వాయర్ పూర్తిగా నిండేందుకు ఇంకో అర అడుగు మేర మాత్రమే నీరు చేరాల్సి ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటితో ప్రాజెక్టు నీటిమట్టం ఎప్పటికప్పుడు పెరుగుతుండటంతో నేడో, రేపో గేట్లు ఎత్తే అవకాశం ఉందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. మూసీ ఎగువ ప్రాంతాలైన హైదరాబాద్ నగరంతో పాటు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, యాదాద్రిభువనగిరి, జనగామ జిల్లాల వాగులు, వంకల ద్వారా ఇటీవలి అకాల వర్షాలకు వరదనీరు వచ్చి చేరింది. దీంతో మండు వేసవిలో మూసీ ప్రాజెక్టు జలాశయం



నీటిమట్టం రోజురోజుకు పెరుగుతూ నిండుకుండలా మారింది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, వరకు 644.50 అడుగులకు చేరుకుంది. నీటినిలువ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.32 టీఎంసీల నీరు రిజర్వాయర్‌లో ఉ ందని నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మూసీ ఎగువప్రాంతాల నుంచి 1004 క్యూసెక్కుల వరదనీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తిగా నిండే దశలో ఉన్నందున అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## పాలమూరు.. పచ్చని పైరు

మహబూబ్‌నగర్ : పల్లెపల్లెనా పల్లేర్లు మొలిచె తెలంగాణలోనా.. పాలమూరులోనా.. అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాడిన పాట ఇక్కడి పరిస్థితికి అద్దం పట్టింది. కరువుకు చిరునామాగా ఉన్న పాలమూరే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ప్రేరణ అయ్యింది. తెలంగాణ ఆవిర్భవించాక పరిస్థితి మారింది. ఈ తొమ్మిదేళ్ల కాలంలో పల్లెలు పచ్చబడ్డాయి. ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం పెరిగింది. 2014 వరకు ఉమ్మడి జిల్లాలో 7.77 లక్షల ఎకరాల విస్తీర్ణంలోనే సాగు ఉ ండేది. ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ద్వారా సాగునీటి లభ్యత పెరగటంతో ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణం 19.34 లక్షల ఎకరాలకు చేరుకుంది. పంటల సాగులో రాష్ట్రంలోనే ఉమ్మడి జిల్లా రెండో స్థానంలో నిలిచింది.
ఆదుకున్న రైతుబంధురాష్ట్ర ప్రభుత్వం 2018లో తీసుకొచ్చిన 'రైతుబంధు' ద్వారా ఏటా 9.85 లక్షల మంది రైతులు లబ్ధిపొందుతు న్నారు. ఉమ్మడి జిల్లాలో 24 లక్షల ఎకరాలకు. ఎకరాకు ఒక్కో పంటకు రూ.5వేల చొప్పున రైతుల ఖాతాలో జమవుతోంది. ఐదేళ్లలో రూ.9,760 కోట్లు అందాయి. పంట సాగుకు పెట్టుబడిగా ఈ డబ్బు ఉపయోగపడుతోంది. రైతులు చనిపోతే రైతుబీమా కింద రూ.5లక్షల సాయం అందుతోంది. పాలమూరు జిల్లాలో 2018 నుంచి ఇప్పటి వరకు 14,946 మంది రైతులు చనిపోగా బాధిత కుటుంబాలకు రూ.747.3 కోట్లు వచ్చాయి.
జలాశయాలకు నిధుల వరద
సాగునీటి ప్రాజెక్టులకు నిధుల వరద పారింది. ఉమ్మడి జిల్లాలో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో సహా ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు రూ.11వేల కోట్లు కేటాయించారు. భూత్పూరు మండలం కర్వెన వద్ద 2015 జూన్ 11న ప్రతిష్ఠాత్మకమైన పాలమూరు ఎత్తిపోతల పథకం పనులకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.52వేల కోట్ల అంచనాతో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడానికి పనులు కొనసాగుతున్నాయి. మొత్తం 21 ప్యాకేజీల్లో నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉదండాపూర్, లక్ష్మీదేవ్‌పూర్ వద్ద జలాశయాలు, కాల్వలు నిర్మించాల్సి ఉండగా 80 శాతం పనులు పూర్తయ్యాయని అధికారుల చెబుతున్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిలసాగర్, భీమా, కల్వకుర్తి తదితర ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ఏటా నిధులు కేటాయించి పనులు చేపట్టడంతో ఆయకట్టు పెరిగింది. 2014లో 1.58 లక్షల ఎకరాలకు సాగునీరు అందేది. నేడు 8 లక్షల ఎకరాలకు అందుతోంది. మినీ ఎత్తిపోతల కింద 2014లో 13వేల ఎకరాలకు నీరందగా 24వేల ఎకరాలకు పెరిగింది. చెరువుల కింద ఆయకట్టు 84వేల నుంచి 1.87 లక్షల ఎకరాలకు పెరిగింది.
గొర్రెల పంపిణీతో బాసటప్రభుత్వం 2017లో చేపట్టిన రెండో విడత గొర్రెల పంపిణీలో 69,886 మందికి యూనిట్లు మంజూరయ్యాయి. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు అందించారు. ప్రభుత్వం రూ.677కోట్లను రాయితీ రూపంలో ఖర్చుచేసింది. రెండో విడతగా 68,230 యూనిట్ల గొర్రెల పంపిణీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకోసం సుమారు రూ.900కోట్లను రాయితీ రూపంలో ప్రభుత్వం కేటాయించనుంది. జోగులాంబ గద్వాల జిల్లాలో మాదాసి కురవలకు మరో 30వేల యూనిట్లను మూడో విడతలో మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
గొర్రెల సంఖ్య రెట్టింపు...మొదటి విడత పంపిణీలో భాగంగా 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఇచ్చారు. నావాటితో పాటు మరో ఇద్దరు లబ్ధిదారుల గొర్రెలను కలిపి మేపడానికి ఒక వ్యక్తిని పెట్టుకున్నాం. మా ముగ్గురికి 150 గొర్రెలు ఉన్నాయి.చెన్నప్ప, రామసముద్రం (మక్తల్),నారాయణపేట జిల్లా
ట్రాక్టరు, విత్తనాలకు ఖర్చు చేస్తున్నా.. : నాకు ఐదెకరాల భూమి ఉ ంది. రైతుబంధు ద్వారా ఏటా రూ.50వేలు వస్తాయి. ఈ మొత్తాన్ని భూమి దున్నే ట్రాక్టరు ఖర్చులకు, విత్తనాల కొనుగోలుకు వినియోగిస్తున్నా. రైతుబంధుతో పెట్టుబడి భారం తగ్గింది.ప్రతాప్‌రెడ్డి, మర్రిపల్లి (చారకొండ), నాగర్‌కర్నూల్ జిల్లా
రైతుబీమాతో భరోసా : నా భర్త పర్వతాలు అనారోగ్యంతో ఆస్పత్రితో చికిత్స పొందుతూ ఫిబ్రవరి 2న చనిపోయారు. పెద్దదిక్కును కోల్పోయాం. రైతుబీమా ఉండటంతో దరఖాస్తు చేసుకున్నాం. గత వారం రూ.5లక్షల చెక్కు వచ్చింది.
ఈశ్వరమ్మ, వేముల(మిడ్జిల్), మహబూబ్‌నగర్ జిల్లా
గతంలో ఒకే పంట సాగుచేసేవాడిని.. : 2014 కంటే ముందు వర్షాధారంగా ఖరీఫ్‌లోనే పంట సాగు చేసేవాడిని. మా ప్రాంతానికి నెట్టెంపాడు కాలువ వచ్చిన తర్వాత సాగు పెరిగింది. ఇప్పుడూ ఖరీఫ్, రబీలో పంటలను సాగు చేస్తున్నా. పనుల కోసం కూలీలను ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకుంటున్నాం. వెంకట్‌రాములు, ఎల్కూరు(మల్దకల్), జోగులాంబ గద్వాల జిల్లా

# రక్తహీనతకు చెక్



కరీంనగర్ : గర్భిణులలో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడానికి ప్రభుత్వం ప్రత్యేక పథకానికి శ్రీకారం చుట్టింది. మాతా, శిశు మరణాలను తగ్గించడం, గర్భిణులలో రక్తహీనత అంతానికి 'కేసీఆర్ న్యూట్రిషన్ కిట్'ను రూపొందించారు. గతేడాది డిసెంబరులో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామారెడ్డి జిల్లాలో ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టులో భాగంగా ప్రారంభించారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో అన్ని జిల్లాలో పంపిణీ చేయడానికి నిర్ణయించగా తాజాగా జిల్లాలో పథకాన్ని ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు..
జిల్లాలో 2106 మంది లబ్ధిదారులు
జిల్లాలోని 20 మండలాలు, ఐదు పురపాలికల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్న వారిలో తొలి విడతలో 2106 మంది గర్భిణులు ఉన్నారని గుర్తించారు. వీరికి రెండు విడతల్లో న్యూట్రిషన్ కిట్లను అందజేయనున్నారు. తొలి విడత 13 నుంచి 24 వారాల మధ్య, రెండో విడత 28 నుంచి 34 వారాల మధ్య అందించనున్నారు. గర్భిణులు ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ, ఆశా, ఏఎన్‌ఎంల ద్వారా నమోదు చేసుకున్న 13 నుంచి 24 వారాల మధ్య న్యూట్రిషన్ కిట్లను అందజేస్తారు. ఈ కిట్‌లో గర్భిణులకు ఉపయోగపడే ప్రొటిన్ పౌడర్(కిలో), కిలో ఖర్జూర పండ్లు, అరకిలో నెయ్యి, ఐరన్ సిరప్, అల్బెండజోల్ మాత్రలు, ఒక కప్పు ఉంటాయి. వీటిని తొలి విడత ప్రత్యేక బుట్టలో రెండో విడత సంచులలో అందించనున్నారు. సుమారు ఒక్కో కిట్‌కు రూ.1962 వరకు ప్రభుత్వం వెచ్చిస్తోంది. మారుమూల ప్రాంతాలు, గ్రామాల్లో గర్భిణి మహిళలు ఆహారం, పోషకాహారం సరైన మోతాదులో తీసుకోకపోవడంతో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తడంతో తరచూ మాతా, శిశు మరణాలు సంభవిస్తున్నా యి. గర్భిణులలో పోషకాహార లోపం, రక్తహీనతకు న్యూట్రిషన్ కిట్లు వరంగా మారనున్నాయి. ఆయా విడతల్లో గర్భిణులకు ఈ కిట్ల ద్వారా మేలు జరగనుంది. దీంతో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరగడంతో పాటు రక్తహీనతకు చెక్ పడనుంది.
జిల్లాకు 1550 కిట్లు..జిల్లాలో ప్రస్తుతం 2106 మంది గర్భిణులను గుర్తించాం. జిల్లాకు ప్రస్తుతం 1550 న్యూట్రిషన్ కిట్లు రాగా పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆసుపత్రులలో గర్భిణులకు కిట్ల పంపిణీ చేపడతాం. న్యూట్రిషన్ కిట్ల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందడంతో పాటు రక్తహీనత లోపాలను తగ్గించవచ్చు. గర్భిణులు కిట్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.డా.జైపాల్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి

# ముంగిట్లోకి.. నవ పాలన



కామారెడ్డి : చిన్న రాష్ట్రాలు అభివృద్ధి సాధిస్తాయి... స్వరాష్ట్ర సాధనకు ఉపయోగపడిన నినాదమిది. తెలంగాణ సిద్ధించాక ప్రజల సంక్షేమం కోసం సర్కారు తపించింది. పాలనలో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన సర్కారు తొమ్మిదేళ్లలో విప్లవాత్మక, చెప్పుకోదగ్గ మార్పుల కు నాంది పలికింది. ముంగిట్లోకే ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా, మండల, పంచాయతీల వికేంద్రీకరణ ఒక ఎత్తైతే, పాలనలోనూ పారదర్శకతకు సాంకేతికతను జోడించారు. పదో వసంతంలోకి అడుగిడుతున్న తరుణంలో మార్పులను మననం చేసుకుందాం.
కొత్త పంచాయతీలు
రాష్ట్ర ఆవిర్భావం నాటికి పంచాయతీలకు అనుబంధ గ్రామాలుండేవి. ఈ పల్లెలు ఏకంగా పంచాయతీలకు కిలోమీటర్ల దూరం ఉండేది. ప్రజలు పాలనాపరమైన అవసరాల కోసం ఎంతో దూరం ప్రయాణిం చాల్సి వచ్చేది. స్వరాష్ట్రం సిద్ధించాక అనుబంధ, గిరిజన పల్లెల కల సాకారమైంది. పంచాయతీ హోదా లభించడంతో గ్రామాభివృద్ధికి అడుగులు పడ్డాయి. స్వరాష్ట్రంలో ఉభయ జిల్లాల్లో 364 నూతన పంచాయతీలు ఏర్పాటయ్యాయి.
పుర హోదా...
అన్ని అర్హతలున్నా మేజర్ పంచాయతీలకు పుర హోదా కల్పించడంలో గత పాలకులు తాత్సారం చేశారనే వాదన ఉంది. రాష్ట్రం ఆవిర్భవించాక ఉమ్మడి జిల్లాలో ఎల్లారెడ్డి, బాన్సువాడ, భీమ్‌గల్‌లకు బల్దియా హోదా లభించింది. రూ.25 కోట్ల చొప్పున టీయూఎఫ్ఐడీసీ నిధులు కేటాయించారు. ఉద్యానవనాలు, సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనతో కొత్తగా ఆవిర్భవించిన మున్సిపాలిటీల్లో వ్యత్యాసం స్పష్టంగా తెలుస్తోంది.
సాంకేతిక శోభ
ఒకప్పుడు మున్సిపాలిటీల్లో భవన నిర్మాణ అనుమతుల కోసం కార్యాల యం చుట్టూ తిరిగి అడిగినంత ముడుపులు సమర్పించుకునే దుస్థితి ఉండేది. రాష్ట్రం సిద్ధించాక పారదర్శకత కోసం స్వయంగా దరఖాస్తు చేసుకుని, నిర్ణీత గడువులోగా అధికారులు పరిష్కరించకపోతే అనుమతి లభించేలా నిబంధన తీసుకొచ్చారు. స్వయంగా దరఖాస్తు చేసుకోవడం, ఆస్తిపన్ను స్వీయ మదింపు వంటి సదుపాయాలతో టీఎస్‌బీపాస్‌ను తెచ్చారు. గ్రామాల్లోనూ సులభతర పాలనకు ఈ-పంచాయతీ ఉ ంది. ఆన్‌లైన్‌లో చెల్లించే వ్యవస్థతో మధ్య దళారులకు అడ్డుకట్ట వేయడానికి దోహదం చేశారు.
రవాణా సేవలు
రవాణా శాఖలో సులభతరమైన సేవలు అందుకోవడానికి స్మార్ట్ (సింపుల్, మోరల్, అకౌంటబుల్, రెస్పాన్సివ్ అండ్ ట్రాన్స్‌పరెంట్-ఎస్.ఎం.ఏ.ఆర్.టి)ని అందుబాటులోకి తీసుకొచ్చింది. సిటిజన్ చార్టర్‌తో నిర్దేశిత గడువులోగా ఆన్‌లైన్‌లో సేవలు పొందేలా చర్యలు తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో బాన్సువాడ డివిజన్ ప్రజలు లైసెన్సులు పొందడానికి బోధన్ రావాల్సి వచ్చేది. తాజాగా బాన్సువాడలోనే సేవలు అందిస్తున్నారు. వాహన ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్సు వంటివి 'ఎంవ్యాలెట్' లో స్మార్ట్‌ఫోన్‌లో భద్రపరచుకునే అవకాశం కల్పించారు.
ఐటీ కంపెనీలు
ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కంపెనీలను విస్తరించే కార్యక్రమాన్ని సర్కారు తీసుకుంది. గ్రామీణ యువతకు ఐటీ ఉద్యోగాలను చేరువ చేయడం, హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గించే ఆశయంతో తీసుకొచ్చిన విధానంలో నిజామాబాద్‌లో ఐటీ హబ్ నిర్మించారు. రూ.50 కోట్లతో నిర్మించిన ఇందులో కనీసంగా వెయ్యి మందికిపైగా ఉద్యోగ అవకాశా లు కల్పించడానికి ఆస్కారముంటుందని ప్రకటించారు.
పోలీస్‌శాఖలో సంస్కరణలు
స్నేహపూర్వక పోలీసింగ్ ప్రస్తుతం ఓ విధానమైంది. పారదర్శక, సత్వర సేవలే లక్ష్యంగా సాంకేతికతను వినియోగించి మార్పులు చేపట్టారు. పోలీస్ కార్యాలయాలు, ఠాణాల్లో ఈ-ఆఫీస్(కాగిత రహిత) సేవలు అమలు చేస్తున్నారు. కేసు పూర్వాపరాలను ఆన్‌లైన్ చేసే సీసీటీఎన్‌ఎస్ (క్రైమ్ కంట్రోల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం)ను ప్రారంభించారు. 5ఎస్(ఐదు రకాల సేవలు ఏకకాలంలో అందుబాటులోకి తేవడం) విధానం అమల్లోకి వచ్చాక ఠాణాలో ఏ అధికారి అందుబాటులో ఉ న్నాఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.
భూ దస్త్రాల ప్రక్షాళన
భూ వివాదాల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం 2016 సెప్టెంబరులో భూదస్త్రాల నవీకరణకు శ్రీకారం చుట్టింది. నిజాం కాలం నాటి దస్త్రాలను నవీకరించి రైతులకు డిజిటల్ పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీని ప్రారంభించింది. భూముల క్రయవిక్రయాలు పారదర్శకంగా చేపట్టేందుకు రిజిస్ట్రేషన్‌తో పాటే మ్యుటేషన్ ఏకకాలంలో అయ్యేలా ధరణి పోర్టల్ దోహదపడుతోంది. ప్రస్తుతం కేవలం వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు మాత్రమే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపడుతున్నారు.
శాఖల పునర్విభజన
సాగు నీటిపారుదల శాఖతో పాటు ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఇంజినీరింగ్ శాఖలను పునర్విభజన చేయడంతో పనితీరు మెరుగుపడింది. ప్రస్తుతం నీటిపంపిణీతో పాటు పనుల పర్యవేక్షణను ఒకే విభాగం కిందకు తీసుకువచ్చి ఉభయ జిల్లాలకు సీఈలను నియమించారు. ఆర్‌అండ్‌బీతో పాటు పీఆర్ ఇంజినీరింగ్ శాఖల్లో సమూల మార్పులు తీసుకువచ్చారు. ర.భ. శాఖను పునర్ వ్యవస్థీకరించారు. దీంతో నిజామాబాద్ జిల్లాకు నూతనంగా ఆర్‌అండ్‌బీ ఎలక్ట్రికల్ డివిజన్, ఎన్‌హెచ్ సర్కిల్, బిల్డింగ్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యాయి.
కొత్త మండలాలు
స్వరాష్ట్రంలో కొత్త మండలాల ఏర్పాటు వేగంగా సాగుతోంది. కామారెడ్డి జిల్లా ఆవిర్భావ సమయంలో కొత్తగా బీబీపేట, రామారెడ్డి, పెద్దకొడప గల్, రాజంపేట, నస్రుల్లాబాద్ మండలాలు ఏర్పడ్డాయి. అనంతరం స్థానిక ప్రజల కోరిక మేరకు మద్నూర్ మండలం నుంచి డోంగ్లీని కొత్తమండలంగా చేశారు. తాజాగా మాచారెడ్డి మండలంలోని తొమ్మిది రెవెన్యూ గ్రామాలతో పల్వంచ మండలాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాల విభజన సమయంలో నిజామాబాద్ జిల్లా పరిధిలో చందూర్, మోస్రా, రుద్రూర్ మండలాలను ఏర్పాటు చేశారు. తాజాగా డొంకేశ్వర్, సాలూరా, ఆలూరు, పోతంగల్ కొత్తగా ఏర్పాటయ్యాయి.
దశాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు
దశాబ్ది ఉత్సవాలకు కలెక్టరేట్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన వేదికతో పాటు ప్రజలు, అధికారులు కూర్చోవడానికి వీలుగా టెంట్లు ఏర్పాటు చేశారు. ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయిస్తున్నారు.

## జాడలేని సాయంత్రం క్లీనిక్‌లు

బోధన్ : యూపీహెచ్‌సీ స్థాయిలో స్పెషాలిటీ సేవలు విస్తరించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సాయంత్రం క్లీనిక్‌లు మూణ్ణాళ్ల ముచ్చటగా మారాయి. నెలకొల్పిన తర్వాత ఒకటి, రెండు నెలలలోపే మూతపడ్డాయి. గతేడాది ఇదే సమయంలో వీటిని అట్టహాసంగా ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. కానీ కొన్ని కేంద్రాల్లో క్షేత్రస్థాయిలో ఆదరణ లేకపోవడం, ఆరోగ్య మిషన్ నుంచి నిధుల కేటాయింపు లేక వీటిని అర్ధాంతరంగా అనధికారికంగా నిలిపివేశారు. నిజామాబాద్ నగరంలో మూడు, బోధన్‌లో ఒక యూపీహెచ్‌సీలో వీటిని ఏర్పాటు చేసి ఎత్తేశారు.
ఇదీ పరిస్థితి: వైద్య వ్యవస్థను బలోపేతం చేసే కార్యక్రమాలకు ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. వ్యాధులు ప్రాణాంతకం కాక మునుపే ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి నియంత్రించడానికి పలు కార్యక్రమాలు తీసుకొచ్చారు. వాటిలో ఒకటి ఈ సాయంత్రం క్లీనిక్. యూపీహెచ్‌సీల్లో వారంలో మూడు రోజుల పాటు క్లీనిక్‌లు నిర్వహిస్తారు. ఒక్కో రోజు ఒక స్పెషాలిటీ వైద్య నిపుణుడు అందుబాటులో ఉంటారు. వారిలో స్త్రీ, పిల్లల వైద్య నిపుణులు, ఫిజిషియన్ ఒక్కో రోజు ఒకరు సేవలందిస్తారు. వీరికి ఒక రోజుకు 20 మందికి పైగా ఓపీ నమోదైతే వైద్యులకు రూ.3 వేలు, స్టాఫ్‌నర్సుకు రూ.200, నాలుగో తరగతి ఉద్యోగికి రూ.100 చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. కానీ ఇక్కడికి రోగులు 20 మంది కంటే తక్కువగానే వస్తున్నారని గుర్తించారు. బోధన్‌లో మాత్రం 20కి పైగా వచ్చినట్లు చెబుతున్నారు.సరైన వైద్యం అందే వీలు: జనం నుంచి సరైన స్పందన లేదనే భావన ఉన్నతాధికారుల్లో వ్యక్తమవడంతో వీటిని నిలిపివేశారు. ఇక చేసిన పనికి సంబంధించిన బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. ఈ విషయంలో వైద్యాధికారులను సంప్రదిస్తే స్పందించడానికి నిరాకరించారు. వైద్య నిపుణుల సేవలు స్థానికంగా అందుబాటులో ఉంటే పట్టణం, నగరంలోని మారుమూల కాలనీవాసులకు ఇవి ప్రయోజనకరంగా ఉండేవి. బస్తీల్లో పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకునే వారు ఆ సమయంలో స్పెషాలిటీ డాక్టర్లు ఉండటంతో పరీక్షలు చేయించుకుని ప్రాథమిక స్థాయిలోనే సరైన వైద్యం అందుకునే వీలు ఉండేది. అధికారులు స్పందించి వీటిని తిరిగి తెరవాలని బోధన్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పంచాయతీలకు కంతుల కిరికిరి

ధరూరు : ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీల అవసరాల నిమిత్తం ట్రాక్టర్లను కొనుగోలు చేశారు. వాటికి కొన్ని పంచాయతీలు ఒకే సారి నగదు చెల్లించి కొనుగోలు చేయగా.. కొన్ని చోట్ల ప్రతి నెలా కంతులు చెల్లించేలా ఒప్పందంతో తీసుకున్నారు. ఇదే ఇప్పుడు పంచాయతీ పాలకవర్గాలకు ఇబ్బందిగా మారింది. మూడు కంతులు చెల్లించకుండా ఉంటే బ్యాంకు అధికారులు నోటీసులు ఇస్తున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే అరకొర నిధులు అభివృద్ధి పనులకు కేటాయిం చకుండా బ్యాంకుల్లో కంతులు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకే సరిపోతున్నాయని ఆయా సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రోజు వారీగా ట్రాక్టర్ డీజిల్ ఖర్చు ఆర్థికభారంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రతి నెలా చిన్న పంచాయతీలకు భారంగా మారుతోంది.
132 పంచాయతీలకు నోటీసులు నిబంధనల మేరకు సకాలంలో కంతులు చెల్లించక పోతే వాహనాలను జప్తు చేసే అధికారం బ్యాంకు అధికారులకు ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 1,684 పంచాయతీల్లో 132 పంచాయతీలకు సంబంధించిన ట్రాక్టర్ల ఈఎంఐలు చెల్లించని కారణంగా ఆయా బ్యాంకుల అధికారులు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆరు నెలలకు ఒకసారి నిధులు వస్తుండటంతో సకాలంలో కంతులు చెల్లించకుంటే ఇబ్బందిగా ఉ ంటుందని భావించిన కొందరు సర్పంచులు అప్పు చేసి బ్యాంకులకు



చెల్లిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు ఖాతాలో జమయ్యాక తీసుకుం టున్నారు. ఆలాంటి పంచాయతీలు 220 వరకు ఉన్నట్లు సమాచారంఈఎంఐ చెల్లించకుంటే ఖాతా డిఫాల్ట్ అవుతుందనే ఉ ద్దేశంలో ప్రతి నెలా కంతు సమయానికి ప్రగతి నిధులు రాకున్నా అప్పు చేసి బ్యాంకులో జమ చేస్తున్నట్లు జోగులాంబ జిల్లాలో ఓబులోనిపల్లి పంచాయతీ సర్పంచి పరశురాముడు తెలిపారు. ఖాతాలో ప్రగతి నిధులు జమయ్యాక తిరిగి తీసుకుంటున్నానని పేర్కొన్నారు.
ప్రభుత్వం చెల్లిస్తే ఇబ్బంది ఉండదుజిల్లాలో సగం వరకు పంచాయతీల పాలకవర్గాలకు ప్రతి నెలా ట్రాక్టర్లకు సంబంధించిన బ్యాంకు కంతుల సమస్య ఉంది. ప్రభుత్వం ప్రగతి నిధుల ద్వారా ఒకేసారి సెటిల్‌మెంట్ చేస్తే ఇబ్బంది ఉండదు. వచ్చే నిధులు ఇతర అభివృద్ధి పనులకైనా వినియోగించుకునే అవకాశం ఉంటుంది.మాజీద్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, జోగులాంబ గద్వాల

## జోరుగా పైరవీలు!

పాలమూరు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు కేటాయించిన సహాయ ఆచార్యుల్లో కొంతమంది ఇక్కడ పనిచేయడానికి అంతగా సుముఖత చూపటం లేదు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లోని ప్రభుత్వ వైద్య కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం గత నెల 22న 147 మంది సహాయ ఆచార్యులను కేటాయించింది. అందులో ఇప్పటివరకు 75 మందే విధుల్లో చేరారు. ఇంకా 72 మంది చేరలేదు. ఈ నెల 21 వరకు గడువు ఉండటంతో వారంతా అప్పటివరకు చూద్దాములే అన్నట్లు యోచిస్తున్నారు. పలువురు ఇతర ఆసుపత్రుల్లో పని చేస్తున్నారు. ఇప్పటికే కొద్దిమంది విధుల్లో చేరినవారు, చేరకుండా ఉన్నవారిలో కొందరు వేరే ప్రాంతాలకు వెళ్లడానికి రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడి(డీఎంఈ) కార్యాలయం చుట్టూ తిరుగుతున్నట్లు సమాచారం. అక్కడ పైరవీలు చేసుకుంటూ తమకు అనుకూలమైన ప్రాంతాల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. క్లీనికల్ విభాగంలో ఉ మ్మడి జిల్లాకు వచ్చిన వారిలో కొందరికి ప్రస్తుతమున్న ప్రాంతాల్లో సొంత క్లీనిక్‌లు ఉన్నాయి. అవి బాగా నడుస్తుండటంతో విధుల్లో చేరడానికి కొందరు ఆసక్తి చూపడం లేదని తెలిసింది.
వినతుల బదిలీలతో ముగ్గురు అసోసియేట్లు.. : మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పనిచేస్తున్న ముగ్గురు అసోసియేట్ ఆచార్యులు కూడా రిక్వెస్ట్ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. జనరల్ మెడిసిన్ అసోసియేట్ ఆచార్యులు డా.కేశవనాథ్‌గౌడ్ జనగామా జిల్లాకు, పాథాలజీ అసోసియేట్ ఆచార్యులు డా.శ్రీలక్ష్మి వికారాబాద్ జిల్లాకు, అనస్థీషియా అసోసియేట్ ఆచార్యులు డా.సునీత వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి అసోసియేట్ ఆచార్యులు వెళ్తే వారి స్థానాల్లో ఎవరూ కొత్తవారు



రాలేదు. ఇప్పటికే తక్కువ మంది ఆచార్యులతో నెట్టుకొస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలకు ముగ్గురు వెళ్లిపోవటం సమస్యగా మారింది. కొత్తగా సహాయ ఆచార్యులు వచ్చినా.. అసోసియేట్ ఆచార్యులపై పని భారం అధికంగా పడనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆయా జిల్లాల వైద్య కళాశాలలకు కేటాయించిన సహాయ ఆచార్యులంతా వచ్చి విధుల్లో చేరితేనే సమస్య తీరుతుంది. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ జిల్లాకు కేటాయించిన 32 సహాయ ఆచార్యుల్లో 24 మంది, నాగర్‌కర్నూల్ జిల్లాకు కేటాయించిన 59 మందిలో 29, వనపర్తి జిల్లాకు కేటాయించిన 56 మందిలో 22 మంది విధుల్లో చేరారు. ఈ నెల 22వ తేదీ తర్వాత గానీ ఎంత మంది జిల్లాలకు వస్తారు, ఎంత మంది వెళతారో స్పష్టత వచ్చే అవకాశం లేదు.
చివరివరకు చూస్తాం.. : సాధ్యమైనంత వరకు ఉద్యోగులు తమకు అనుకూలంగా ఉండే ప్రాంతాల్లో పనిచేయడానికి ఆసక్తి చూపుతారు. మహబూబ్‌నగర్‌కు కేటాయించిన వారిలో ఎక్కువ మంది ఇక్కడే ఉ ంటారని అనుకుంటున్నా. రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల వద్ద పైరవీలకు తావుండదు. తప్పనిసరిగా వారంతా కేటాయించిన జిల్లాల్లోని కళాశాల ల్లో విధుల్లో చేరాల్సి ఉంటుంది. సకాలంలో రాకపోతే ప్రభుత్వానికి తెలియచేస్తాం. ఇంకా 20 రోజుల గడువు ఉంది. చివరివరకు చూస్తాం.డా.రమేశ్, మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్

# జగన్ గోదావరి మంత్రాంగం...!



రాజమండ్రి : గోదావరి జిల్లాలలో రాజకీయంగా ఇబ్బందులు ఏర్పడకుండా జగన్ సరికొత్త మంత్రాంగాన్ని రచిస్తున్నారు. గోదావరి జిల్లాలలో కాపుల ప్రభావం ఎలా ఉంటుంది అన్నది బయటకు తెలియడంలేదు. టీడీపీ జనసేన పొత్తు పెట్టుకున్నాయి. దాంతో కాపులు 2014 మాదిరిగా ఈ కూటమి వైపు మొగ్గు చూపుతారా అన్నది ఒక కీలకమైన చర్చగా ఉంది. పవన్ కళ్యాణ్ పదేళ్ళ తరువాత అయినా సీఎం అభ్యర్థిగా రావడంలేదు. ఇది ఒక మెయిన్ పాయింట్. అదే సమయంలో ఎక్కువ సీట్లకు జనసేన పోటీ చేయకపోతే జూనియర్ పార్టనర్ గా టీడీపీ జమ కట్టడం కాదు జనాలే అనుకుంటారు. అపుడు బలమైన సామాజిక వర్గం రియాక్షన్ ఎలా ఉంటుంది అన్నది కూడా చూడాల్సి ఉంది. ఇవన్నీ పక్కన పెడితే జనసేన టీడీపీ పొత్తుని మాత్రం సీరియస్ గానే వైసీపీ చూస్తోంది. అటు నుంచి ఇటు అయినా కూడా ఏ మాత్రం పొలిటికల్ ట్రబుల్ ఇవ్వకుండా చూసుకునేందుకు వైసీపీ అధినాయకత్వం గోదావరి జిల్లాలను గట్టిగానే టార్గెట్ చేసింది. ఈ జిల్లాలలో కాపులతో పాటు బీసీలు, ఎస్సీ ఎస్టీలు ఎక్కువే. దాంతో ఈ వర్గాలను తమ వైపునకు తిప్పుకోవడం ద్వారా 2019 నాటి మ్యాజిక్ ని రిపీట్ చేయాలని జగన్ భావిస్తున్నారు. అందుకే మంత్రులుగా ఉన్న వారిని ఎంపీలుగా పంపుతున్నారు. అలాగే ఎంపీలుగా ఉన్న వారిని ఎమ్మెల్యేలను చేస్తున్నారు. కొందరు మంత్రులను తీసుకుని వచ్చి కీలకమైన నియోజకవర్గాలలో నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అలా చూస్తే కనుక రామచంద్రాపురం నుంచి మంత్రిగా ఉన్న వేణు గోపాల క్రిష్ణని రాజమండ్రి రూరల్ కి పంపుతున్నట్లుగా తెలుస్తోంది. ఇదే విషయం నిన్నటిదాకా ప్రచారంగా ఉండగా మంత్రి వేణు మాత్రం అదే నిజం అని అంటున్నారు. తనను జగన్ రాజమండ్రి రూరల్ కి వెళ్లమన్నారు అని అంటున్నారు. ఆయన ఆదేశం మేరకు అక్కడ నుంచి 2024 ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లుగా ప్రకటించారు. ఇక రామచంద్రాపురంలో మాజీ మంత్రి పిల్లి సుభాష్ చంద్రబోస్ కి మంత్రి వేణుకు మధ్య విభేదాలు ఉన్నాయని అంటారు. ఆ మధ్య దీని మీద రచ్చ సాగింది. దాంతో జగన్ అపుడు సర్దుబాటు చేశారు. ఇపుడు ఆ సీటుని పిల్లి ఫ్యామిలీకే ఇస్తున్నారు. మంత్రి వేణు రాజమండ్రికి వెళుతున్నారు. ఇక రాజమండ్రి అర్బన్ నుంచి ఎంపీ భరత్ పోటీ చేయనున్నారు. అంటే ఇద్దరు బీసీలు రెండు సీట్లలో పోటీ పడతారు అన్న మాట. అలాగే కాపులలో బలంగా ఉన్న నేతలను కూడా అటూ ఇటూ మార్చడం ద్వారా గెలుపు సొంతం చేసుకునే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. అదే విధంగా పిఠాపురం నుంచి కాకినాడ ఎంపీ వంగా గీత పోటీ చేయనున్నారు అని అంటున్నారు. దాంతో పాటుగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా ఉన్న మాజీ మంత్రి కురసాల కన్నబాబుని కాకినాడ ఎంపీ సీటుకు పోటీ చేయమని కోరుతారు అని అంటున్నారు. ఇక ఎమ్మెల్యేలుగా బాగా ఫ్యామస్ అయిన వారిని ఎంపీలుగా పంపుతోంది. అలా రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాద్ ని అమలాపురం ఎంపీగా పంపాలని చూస్తోంది. మొత్తం మీద చాలా సీట్లలో బీసీలకు ఇతర వర్గాలకు పెద్ద పీట వేయడం ద్వారా గోదావరిలో ఫ్యాన్ గిర్రున తిరిగేలా వైసీపీ తన రాజకీయ చాకచక్యం ప్రదర్శిస్తోంది అని అంటున్నారు.




అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరి అయోధ్యలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా అయోధ్య లో ఆధునిక హంగులు, రామమందిర చిత్రాలతో పునరుద్ధరించిన అయోధ్య రైల్వేస్టేషన్‌ను ప్రధాని ప్రారంభించారు. ఆయన వెంట యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తదితరులు ఉన్నారు. రైల్వే స్టేషన్ విశేషాలను మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రధానికి వివరించారు.

**8 రైళ్లకు పచ్చజెండా..** అనంతరం ప్రధాని మోదీ రెండు అమృత్ భారత్, ఆరు వందే భారత్ రైళ్లకు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు అమృత్ భారత్ రైల్లోకి వెళ్లి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. పర్యటనలో భాగంగా అయోధ్యలోని మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మోదీ ప్రారంభిస్తారు. ఆ కార్యక్రమం అనంతరం ఎయిర్‌పోర్టు పక్కనున్న మైదానంలో ఏర్పాటుచేసే 'జన్ సభ'లో ప్రసంగిస్తారు.

**అమృత్ భారత్ ఫీచర్లివే..** అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ నాన్ ఏసీ రైలు పుష్-పుల్ రైలు. ముందూ వెనుక ఇంజిన్లు ఉంటాయి. దీనివల్ల తక్కువ సమయంలోనే రైలు వేగాన్ని అందుకోవడంతోపాటు, ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఇందులో 22 కోచ్‌లు ఉంటాయి. 12 సెకండ్ క్లాస్ త్రీటైర్ స్లీపర్ కాగా.. 8 జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు, రెండు గార్డు కంపార్ట్‌మెంట్స్ ఉంటాయి. ఈ 2 కంపార్ట్‌మెంట్లలోనే కొంత భాగాన్ని మహిళలకు, దివ్యాంగులకు ప్రత్యేకంగా కేటాయిస్తారు. ఈ రైళ్లు గరిష్ఠంగా 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి.

**15 కిలోమీటర్ల మెగా రోడ్ షో..** ఈ ఉదయం అయోధ్య చేరుకున్న ప్రధానికి రాష్ట్ర గవర్నర్ ఆనందిబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. రైల్వే స్టేషన్ వరకు 15 కిలోమీటర్ల మేర జరిగిన ఈ రోడ్ షోలో దారి పొడవునా ప్రధానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. మధ్య మధ్యలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 1,400 మంది కళాకారులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.




అమరావతి: తమ సమస్యలను పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె శనివారం 19వ రోజుకు చేరుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వ్యాప్తంగా వివిధ రూపాల్లో కార్యకర్తలు నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. ఇవాళ పలు చోట్ల మంత్రుల ఇంటి ముట్టడికి యత్నించారు. గుంటూరులోని శ్యామలనగర్‌లో మంత్రి విడదల రజిని ఇంటిని అంగన్వాడీలు ముట్టడించారు. దాదాపు నాలుగు నియోజకవర్గాల నుంచి అంగన్వాడీలు తరలివచ్చారు. ప్రభుత్వం స్పందించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమకు కనీస వేతనాలు పెంచి గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో అంగన్వాడీల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని ఈ సందర్భంగా మంత్రి రజని తెలిపారు. అంగన్వాడీలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అందరి సమస్యలను పరిష్కరిస్తుందని చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో మంత్రి సురేష్ ఇంటిని సైతం అంగన్వాడీలు ముట్టడించారు. మంత్రి సురేష్ ఇంటి ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. ఈ క్రమంలో పోలీసులు, అంగన్వాడీల మధ్య తోపులాట జరిగి ఉద్రిక్తతకు దారి తీసింది. అలాగే ఒంగోలులోని మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయాన్ని దిగ్బంధించారు. మంత్రి ఉష శ్రీచరణ్ ఇంటి ముట్టడికి కూడా అంగన్వాడీలు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వెళుతున్న అంగన్వాడీలను నాలుగో పట్టణ పోలీసులు అడ్డుకున్నారు. శివారు ప్రాంతంలో వాహనాలను నిలిపి అంగన్వాడీలను అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. దీంతో అంగన్వాడీలు స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి ఇంటి ముట్టడికి బయల్దేరిన అంగన్వాడీలను వెస్ట్ చర్చి కూడలి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు రోడ్డుపైనే బైఠాయించి నినాదాలు చేశారు. ఈ క్రమంలో రాకపోకలను పోలీసులు దారిమళ్లించారు. విజయనగరంలో మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటి ముట్టడికి అంగన్వాడీలు యత్నించారు




కరడుగట్టిన అంతర్జాతీయ ఉగ్రవాది, లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌ను భారత్‌కు తీసుకొచ్చేందుకు కేంద్రం చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అతడిని తమకు అప్పగించాలని న్యూదిల్లీ ఇటీవల పాకిస్థాన్‌ను అధికారికంగా కోరింది. తమ అభ్యర్థనను ఇస్లామాబాద్‌కు పంపినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి వెల్లడించారు. దీనిపై పాక్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలోచ్ తాజాగా స్పందించారు. "మనీలాండరింగ్‌కు సంబంధించిన కేసులో హాఫీజ్ సయీద్ అప్పగింత కోసం భారత అధికారుల నుంచి అభ్యర్థన అందింది. అయితే, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షికంగా ఖైదీల అప్పగింత ఒప్పందం అనేది లేదు" అని ముంతాజ్ ఓ ప్రకటనలో వెల్లడించినట్లు డాన్ పత్రిక తెలిపింది. దీంతో హాఫీజ్‌ను భారత్‌కు అప్పగించే ఉద్దేశం పాక్‌కు లేదని స్పష్టమవుతోంది. 2008 నవంబరు 26న దేశ వాణిజ్య రాజధాని ముంబయి (26/11 %వీబఎఝఉ దీశ్రీఝర్ం%)లో ఉగ్రమూకలు మారణహోమం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో పాటు మరెన్నో ఉగ్రదాడుల్లో హాఫీజ్ సయీద్ కీలక సూత్రధారిగా ఉన్నాడు. భారత్‌లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల్లో ఒకడైన సయీద్‌ను.. ఐక్యరాజ్య సమితి కూడా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. అతడి తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డ్ ప్రకటించింది. వీటితో పాటు ఉగ్ర కార్యకలాపాలకు ఆర్థిక సహకారం అందించారన్న ఆరోపణలతో పలు మనీలాండరింగ్ కేసుల్లోనూ హాఫీజ్‌పై ఎన్నో కేసులు ఉన్నాయి. ముంబయి పేలుళ్ల కేసులో విచారణ నిమిత్తం అతడిని తమకు అప్పగించాలని భారత్ ఎన్నోసార్లు డిమాండ్ చేసినా పాక్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. కాగా.. ఉగ్రవాదులకు నిధులు అందిస్తున్నారన్న పలు కేసుల్లో హాఫీజ్ 2019లో అరెస్టయ్యాడు. ఈ కేసులకు సంబంధించి అతడికి 31 ఏళ్ల జైలు శిక్ష పడింది. అయితే, ప్రస్తుతం పాక్ జైల్లో ఉన్న హాఫీజ్.. అక్కడి నుంచే దేశ రాజకీయాలను శాసిస్తున్నట్లు పలు కథనాలు చెబుతున్నాయి. సయీద్ ఏర్పాటు చేసిన 'ది పాకిస్థాన్ మర్కజీ ముస్లిం లీగ్' (పీఎంఎంఎల్) పార్టీ.. వచ్చే ఏడాది జరగబోయే పాక్ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. ఇదే పార్టీ తరఫున హాఫీజ్ తనయుడు తల్హా సయీద్ ఎన్ఏ-127 స్థానం నుంచి బరిలోకి దిగుతున్నాడు. 2008లో జరిగిన ముంబయి పేలుళ్లలో 166 మంది మృతిచెందిన విషయం తెలిసిందే.

# స్విట్జర్లాండ్ లో కలవబోతున్న రేవంత్ అండ్ జగన్...!?





అమరావతి :ఇది నిజంగా ఒక గొప్ప విషయమే. అలాగే అరుదైన ఘటనగానే చూడాల్సి ఉంటుంది. ఎందుచేతనంటే ఇద్దరు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పరాయి దేశంలో కలవబోవడం. ఆ ఇద్దరూ ఎవరో కాదు వైఎస్ జగన్, అలాగే రేవంత్ రెడ్డి. ఈ ఇద్దరు ముఖ్యమంత్రులను కలిపే వేదిక స్విట్జర్లాండ్ అని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి తొలిసారిగా ఒక విదేశీ పర్యటన చేయబోతున్నారు. ఆయన కొత్త ఏడాది జనవరి 15 నుంచి 19 మధ్యలో స్విట్జర్లాండ్ లో పర్యటించనున్నట్లుగా తెలుస్తోంది. అక్కడ జరిగే దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో రేవంత్ రెడ్డి తెలంగాణా రాష్ట్ర ప్రతినిధిగా పాల్గొనబోతున్నారు. ఆయన వెంట మంత్రులు శ్రీధర్ బాబు, ఇతర అధికారులు కూడా ఉంటారు. ఇది ఇపుడు తెలంగాణా ప్రభుత్వ వర్గాల నుంచి వచ్చిన ఒక సమాచారంగా ప్రచారంలో ఉంది. ప్రపంచ పెట్టుబడుల సదస్సులో రేవంత్ రెడ్డి గళం విప్పి తెలంగాణాకు పెట్టుబడులను ఆకట్టుకోవడం కోసం ఈ టూర్ ని వినియోగించుకోబోతున్నారు అన్న మాట. ఇక ఏపీ సీఎం జగన్ కూడా గతంలో దావోస్ సదస్సుకు అటెండ్ అయ్యారు. ఇపుడు మరోసారి ఆయన కూడా వెళ్లబోతున్నారు అని అంటున్నారు. ముఖ్యమంత్రి కూడా స్విట్జర్లాండ్ కి వెళ్ళాలని గట్టిగా ఆలోచన చేస్తున్నారు అని అంటున్నారు. ఎందుకంటే ఎన్నికలు ఏపీలో దగ్గరలో ఉన్నాయి. దాని కంటే ముందు వచ్చే ఈ ప్రపంచ పెట్టుబడుల సదస్సులో ఏపీకి భారీ ఎత్తున పెట్టుబడులు తేవడం ద్వారా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి సూపర్ సక్సెస్ మంత్రంగా చేసుకోవచ్చు అన్నది వైసీపీ అధినాయకత్వం ఆలోచనగా ఉంది అని అంటున్నారు. దాంతో తెలుస్తున్న భోగట్టా ఏంటి అంటే జగన్ సైతం చలో స్విట్జర్లాండ్ అంటున్నారుట. మరి అటు రేవంత్ ఇటు జగన్ ఇద్దరూ కొత్త ఏడాది మొదట్లోనే ఫస్ట్ కలిసే చోటు ఏంటి అంటే అది స్విట్జర్లాండ్ అనే అంతా అంటున్నారు. ఈ మేరకు ఒక ప్రచారం అయితే గట్టిగా వినిపిస్తోంది. ఏపీ తెలంగాణా సీఎంలు కలుస్తారు అని ఇటీవల కూడా వార్తలు వచ్చాయి. రేవంత్ రెడ్డి మొక్కులు చెల్లించుకునేందుకు విజయవాడ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయానికి వస్తారని ఈ సందర్భంగా ఇద్దరూ భేటీ అవుతారు అని అనుకున్నారు. కానీ ఇపుడు ఏకంగా దేశం కానీ దేశం పరాయి దేశం స్విట్జర్లాండ్ లో మీట్ అవుతారు అని పుకార్లు అయితే షికార్లు చేస్తున్నారు. ఇది రాజకీయంగా మాత్రం ప్రకంపనలు సృష్టించే అంశంగా ఉంటుందని అంటున్నారు. చూడాలి మరి ఈ అరుదైన కలయిక ఉంటుందా లేదా అన్నది మరో ఇరవై రోజులలో తెలిసిపోతుంది అని అంటున్నారు.




మంగళగిరి: వైతెపా అధ్యక్షురాలు షర్మిల కాంగ్రెస్‌కు వెళ్లేది నిజమే అయితే.. తానూ ఆమె వెంటే నడుస్తానని ఇటీవల ఎమ్మెల్యే పదవికి, వైకాపా పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వెల్లడించారు. మంగళగిరిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "నేను ఏ పార్టీలో ఉంటాననేది కాలమే నిర్ణయిస్తుంది. వైకాపాకు నేను ఎంత సేవ చేశానో నాకు తెలుసు. నేను సర్వస్వం పోగొట్టుకున్నాను. ఇకపై వైఎస్ షర్మిల వెంట నడుస్తా. షర్మిలమ్మ ఏ నిర్ణయం తీసుకున్నా ఆమె వెంటే ఉంటా. వైకాపాకు సిద్ధాంతాలు ఉండాలి. మంగళగిరి ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు. రూ.1200 కోట్లతో అభివృద్ధి చేస్తామని చెప్పి రూ.120 కోట్లను మాత్రమే కేటాయించారు. నా సొంత డబ్బుతో నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు చేశా. 50 ఏళ్లలో జరగని అభివృద్ధి నాలుగేళ్లలో చేసి చూపించా. స్వయంగా నేనే రూ.8 కోట్ల వరకు బయట అప్పులు తెచ్చి కాంట్రాక్టర్లకు ఇచ్చాను. లోకేశ్‌ను ఓడించిన నాకు సహకారం అందించకపోతే ఎలా? నేను ఎవరినీ నిందించడం లేదు. నిధులు మంజూరు చేస్తానని నాకు ధనుంజయ రెడ్డి చాలా సార్లు సందేశాలు పెట్టారు. ఎన్నికలు దగ్గరకు వచ్చినా ఇంకెప్పుడు నిధులు మంజూరు చేస్తారు. రాజీనామా ఆమోదించకపోవడం అనేది వాళ్ల ఇష్టం. నేను స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా ఇచ్చా. ఎవరు గెలవాలని నిర్ణయించేది ప్రజలే. నేను ఏ పార్టీలో చేరినా అదే రోజే నిర్ణయం చెబుతా. గతంలో వైకాపాలోనే ఉంటానని చెప్పి ఇప్పుడు పార్టీని వీడాను. దీనికి సీఎం జగనే సమాధానం చెప్పాలి. చాలా మంది నన్ను ఇతర పార్టీల్లోకి రావాలని ఆహ్వానించారు. వైఎస్ కుటుంబంతోనే ఉన్నా.. ఉంటానని వారికి చెప్పా. చంద్రబాబుపై వేసిన కేసులపై న్యాయ పోరాటం చేస్తా. వైకాపా ప్రభుత్వం తప్పు చేస్తే వాటిపై కేసులు వేసేందుకు అయినా వెనకాడను. తప్పులు ఎవరు చేశారు అనేది న్యాయస్థానాలు తేలుస్తాయి. నేను లేకపోయినా మంగళగిరి అభివృద్ధి ఆగదు. నాకు జగన్ టికెట్ ఇవ్వలేదని నేను పార్టీని వీడలేదు. పొమ్మన లేక పొగపెట్టారు. నాకు, చిరంజీవికి, జగన్‌కు మధ్య ఏమి జరిగిందనేది మా అందరికీ తెలుసు" అని ఆళ్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు.




అమరావతి: ఏపీలో ఇళ్ల నిర్మాణం పేరిట భారీ కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని మోదీకి ఆయన 5 పేజీల లేఖ రాశారు "వైకాపా పాలనలో భూసేకరణ పేరిట రూ.32,141 కోట్ల నిధులు దుర్వినియోగం చేశారు. ఇళ్ల పట్టాలు, నిర్మాణంపై ప్రభుత్వం భిన్న ప్రకటనలు చేస్తోంది. సీబీఐ వంటి సంస్థలతో దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు తెలుస్తాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలు భూ సేకరణలో కీలకంగా వ్యవహరించారు. గతంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను కూడా పూర్తిగా లబ్ధిదారులకు ఇవ్వలేదు. 6.68 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తయితే 86,984 మందికే ఇచ్చారు. ప్రభుత్వం తీరుతో మిగతా లబ్ధిదారులు విసుగుచెందారు" అని పవన్ తన లేఖలో పేర్కొన్నారు.

## తిరుమలలో మరోసారి చిరుత, ఎలుగుబంటి కదలికలు





తిరుమల: తిరుమల అలిపిరి నడక మార్గంలో మరోసారి చిరుత, ఎలుగు బంటి సంచారం కలకలం రేపింది. చిన్నారి లక్షితపై చిరుత దాడి చేసి చంపిన ప్రాంతంలోనే.. ఈ నెల 13, 26 తేదీల్లో వీటి సంచారం కనిపించినట్లు అటవీశాఖ అధికారులు ట్రాప్ కెమెరాల ద్వారా గుర్తించారు. ఈ నేపథ్యంలో నడకమార్గంలో వచ్చే భక్తులను తితిదే హెచ్చరించింది. అప్రమత్తంగా, గుంపులు గుంపులుగా భక్తులు రావాలని సూచించింది.

## విశాఖలో చెత్తవాహనాలను అడ్డుకున్న పారిశుద్ధ్య కార్మికులు..



విశాఖ: డిమాండ్ల సాధన కోసం పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరసన కొనసాగు తోంది. విశాఖలో రాత్రి దీక్షా శిబిరం వద్ద నిద్రపోయిన కార్మికులు.. శనివారం తెల్లవారు జాము నుంచే ఆందోళనకు దిగారు. కేఆర్ఎం కాలనీ జీవీఎంసీ చెత్తవాహనాల యార్డ్ వద్ద నిరసన చేపట్టారు. చెత్త వాహనాలు బయటకు రాకుండా అడ్డుకున్నారు. తమను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని నినాదాలు చేశారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిన్న రాత్రి ఎంవీపీ కాలనీ యార్డ్ నుంచి తెచ్చి శివాజీ పార్క్‌లో ఉంచిన చెత్త సేకరణ వాహనాలను పారిశుద్ధ్య కార్మికులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ భారీగా పోలీసులు మోహరించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

## డిఫరెంట్ ఔట్ ఫిట్‌లో అందాల 'గూఢచారి'

2013 లో జరిగిన మిస్ ఎర్త్ ఇండియా అందాల పోటీల్లో భారతదేశం తరపున పాల్గొన్న అందాల శోభితా ధూళిపాళ్ల అదే ఏడాది జరిగిన మిస్ ఇండియా అందాల పోటీల్లో రెండో స్థానంలో నిలిచిన విషయం తెల్సిందే. తెలుగు అమ్మాయి, తెనాలి అమ్మాయి అయిన శోభిత టాలీవుడ్ లో ప్రయత్నించకుండా ముంబై వెళ్లి మోడలింగ్ పై ఆసక్తి కనబర్చింది. మోడల్ గా బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ దృష్టిని ఆకర్షించిన ఈ అమ్మడు హిందీ సినిమాల్లో నటించి మెప్పించింది. తెలుగు లో అడవి శేష్ కు జోడీగా గూఢచారి సినిమాలో నటించడం ద్వారా మంచి గుర్తింపును దక్కించుకుంది.



హీరోయిన్ గా బాలీవుడ్ లో తన జోరు కంటిన్యూ చేస్తోంది. వెబ్ సిరీస్ ల్లో కూడా అందంతో అలరిస్తూ ఉంది. ఇన్‌స్టాలో ఎప్పటికప్పుడు డిఫరెంట్ ఔట్ ఫిట్ లో ఈ అమ్మడు తన ఫాలోవర్స్ కి మరియు ఫ్యాన్స్ కి కన్నుల విందు చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు తన అందమైన ఔట్ ఫిట్ తో మరింత అందంగా కనిపిస్తూ నెటిజన్స్ కు వీనుల విందు అన్నట్లుగా నిలిచింది అనడంలో సందేహం లేదు. ఆ మధ్య ఒక టాలీవుడ్ హీరోతో ఈమె ప్రేమలో ఉంది అంటూ వార్తలు వచ్చాయి. అయితే ఇరు వైపుల నుంచి అలాంటిది ఏమీ లేదు అంటూ క్లారిటీ వచ్చింది. అయితే ఇప్పటికి కూడా కొన్ని ఫోటోలు మరియు వీడియోలను నెటిజన్స్ చూపించి ఆ హీరోతో శోభిత ప్రేమలో ఉందని గట్టిగా వాదిస్తున్నారు. ముందు ముందు ఏం జరుగుతుందో చూడాలి.

## టాలీవుడ్ లాగే అక్కడా అలాంటి ఎదురుదెబ్బే!

అన్నీ ఉన్నా కొన్నిసార్లు టైం కలిసి రాకపోతే? ఎవరు మాత్రం ఏం చేయగలరు. ఆ టైమ్ వచ్చే వరకూ వెయిట్ చేయడం తప్ప చేసేదేం లేదు. ప్రస్తుతం తాప్సీ కెరీర్ విషయంలో అలాగే అనిపిస్తుంది. ఎంతో సంతోషంగా రంగుల ప్రపంచంలోకి అడుగు పెట్టింది. దశాబ్ధం ప్రయాణాన్ని పూర్తి చేసింది. తెలుగులో 'ఝుమ్మంది నాదం' చిత్రంతో లాంచ్ అవ్వగా..బాలీవుడ్ లో ఛష్మీ బద్దూర్ తో ఎంట్రీ ఇచ్చింది. ఈ రెండు గాక తమిళ్..మలయాళంలో సైతం ఒక్కో సినిమా చేసుకుంటూ వెళ్లింది. మరి ఎక్కడైనా సక్సెస్ అయిందా? అంటే కెరీర్ లో చెప్పుకొదగ్గ బ్లాక్ బస్టర్ చిత్రాలంటూ ఏవీ కనిపించలేదు. తెలుగులో అవకాశాలు వస్తున్నా...విజయాలు రావడం లేదని వస్తోన్న అవకాశాల్ని సైతం కాదని బాలీవుడ్ లో మళ్లీ రీ లాంచ్ అయింది. అప్పటి నుంచి అక్కడే సినిమాలు చేస్తోంది. ఎన్నో సినిమాలు చేసింది. ఎంతో మంది స్టార్లతో పనిచేసింది. చివరికి సొంతంగా నిర్మాణ సంస్థని సైతం స్థాపించింది. మరి అక్కడ అమ్మడు



సాధించింది ఏదైనా ఉందా? అంటే అక్కడా సైలెంట్ గా ఉండాల్సిన సన్నివేశమే కనిపిస్తుంది. ఇదంతా 'డంకీ' విజయం గతంలా మార్చేస్తుంది అనుకుంటే? అక్కడా ఫలితం ఆశాజ నకంగా కనిపించడం లేదు. భారీ అంచనాల మధ్య 'డంకీ' రిలీజ్ అయిన సంగతి తెలిసిందే. 'పఠాన్'..'జవాన్' విజయాల తర్వాత షారుక్ ఫుల్ స్వింగ్ లో ఉండటంతో డంకీతోనూ 1000 కోట్ల వసూళ్లు తెచ్చే సినిమా అవుతుందని అంచనాలుండేవి. కానీ 200 కోట్లు కూడా తేవడం కష్టంగా కనిపిస్తుంది. తొలి రోజు ఓపెనింగ్స్ కూడా పెద్దగా కనిపంచలేదు. ఈ సినిమా కంటే టైగర్ 3 వసూళ్లు ఎంతో మెరుగ్గా ఉన్నాయి. ఇక ఈ సినిమాపై తాప్సీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. కానీ ఈసారి కూడా నిరాశ తప్పలేదు. 'డంకీ'తో ఫాంలోకి రావచ్చని చాలా ఆశలే పెట్టుకుని వెయిట్ చేసింది. కానీ ఫలితం మాత్రం అంతకంతకు నిరాశనే మిగిల్చింది. అలాగని తాప్సీ పెర్ఫార్మెన్స్ ని తీసేయడానికి లేదు. తన పాత్రకి నూరు శాతం న్యాయం చేసింది. తొలుత ఆ పాత్రకి న్యాయం చేయగలదా? అన్న సందేహం తెరపైకి వచ్చింది. కానీ సినిమా చూసిన తర్వాత ఆ పాత్రకి తాప్సీ మాత్రమే న్యాయం చేయగలదని ప్రూవ్ చేసింది. పాత్ర పరంగా పేరు పెట్టడానికి లేదు. కానీ ఫలితం పరంగా తాప్సీకి మరోసారి నిరాశ తప్పనట్లే కనిపిస్తోంది.





# ముంబైకి పోయిస్తున్నారు!



ఈ ముంబైకి ఉలి పోయించడానికి వచ్చాను! అని చెబుతాడు 'బిజినెస్ మేన్'లో మహేష్ బాబు. ఇటీవలి కాలంలో మన స్టార్ హీరోల తీరుతెన్నులు చూస్తుంటే ముంబైకి పోయించడానికే వెళుతున్నట్టు కనిపిస్తోంది. మన స్టార్లు చీటికి మాటికి ముంబై విమానాశ్రయంలో స్టిల్ ఫోటోగ్రాఫర్ల కెమెరాలకు చిక్కుతున్నారు. అట్నుంచి ఆ ఫోటోలన్నీ ఇక్కడ టాలీవుడ్ సర్కిల్స్ లోకి వస్తున్నాయి. దీంతో అసలు మన స్టార్లు అంతా ముంబైకే ఎందుకు వెళుతున్నారు? అన్న ఆరాలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా ఇటీవలి కాలంలో రెగ్యులర్ గా ముంబైకి వెళుతున్న స్టార్ హీరో రామ్ చరణ్. అతడు అక్కడే సొంతంగా ఒక ఇంటిని కొనుగోలు చేసి, సొంత వ్యాపారాలకు ప్లాన్ చేసాడని కథనాలొచ్చాయి. ఇటీవల తమ కుమార్తె కిన్ క్లారా, భార్య ఉపాసన సహా చరణ్ ముంబైలో చక్కర్లు కొట్టడం చర్చనీయాంశమైంది. అయితే చరణ్ ఇటీవల ముంబై నుంచి తన వ్యాపార కార్యకలాపాలను చక్కదిద్దుతున్నాడు. పనిలో పనిగా ముంబై సినీపరిశ్రమలో తన ఎదుగుదలకు సంబంధించిన పూర్తి ప్రణాళికలతో దూసుకెళుతున్నాడు. ఆర్.ఆర్.ఆర్ హిందీ బెల్ట్ లోను పెద్ద విజయం సాధించింది. ఆస్కార్ - గోల్డెన్ గ్లోబ్ సహా పలు అవార్డులు ఈ సినిమాకి దక్కాయి. ఇదే అదనుగా స్టార్ హీరో రామ్ చరణ్ స్పీడ్ పెంచాడు. అతడు నటిస్తున్న గేమ్ ఛేంజర్ సహా మునుముందు నటించబోయే పాన్ ఇండియా చిత్రాలకు మంచి బిజినెస్ దక్కేందుకు ప్రతిదీ సుగమం చేస్తున్నాడని సమాచారం. మరోవైపు యంగ్ టైగర్ ఎన్టీఆర్ కూడా ఇటీవల ముంబైకి తరచుగా వెళుతున్నారు. అతడికి ఆర్.ఆర్.ఆర్ తో పాన్ ఇండియా స్టార్ గా గుర్తింపు దక్కింది. ఆ వెంటనే కొరటాల నేతృత్వంలోని దేవర కాన్వాస్ అమాంతం మారిపోయింది. ఈ సినిమా బిజినెస్ సహా తదుపరి ప్రశాంత్ నీల్ తో సినిమా, ఇతర పెద్ద సినిమాల విషయమై ఎన్టీఆర్ హిందీ మార్కెట్లో గ్రిప్ పెంచుకునే పనిలో ఉన్నాడని సమాచారం. ప్రస్తుతం ఎన్టీఆర్ నటిస్తున్న దేవరను రెండు భాగాలుగా తెరకెక్కిస్తుండగా, ఈ సినిమాకి పాన్ ఇండియా రేంజ్ బిజినెస్ తెచ్చేందుకు ఎన్టీఆర్ మంత్రాంగం నడిపిస్తున్నారు. మరోవైపు దగ్గు బాటి రానా బాహుబలి రిలీజ్ కి ముందు నుంచి కూడా హిందీ చిత్రసీమకు సుపరిచితుడు. ముంబైకి రెగ్యులర్ గానే వెళుతుంటాడు. ఇటీవల మరింత ఫ్రీక్వెంట్ గా ముంబైకి వెళుతున్నాడు. రానా తదుపరి హిరణ్య కశిప సహా పలు భారీ పాన్ ఇండియా చిత్రాల్లో నటిస్తున్నాడు. లక్ష్మీ మంచు చాలా కాలంగా బాలీవుడ్ ప్రముఖులతో సత్సంబంధాలను కొనసాగిస్తున్నారు. మారుతున్న సినారియోలో బాలీవుడ్ వెబ్ సిరీస్ లలోను లక్ష్మీ మంచు నటించేందుకు ఆస్కారం లేకపోలేదు. నిర్మాతగాను ఇతరులతో భాగస్వామ్యంలో ఏదైనా ప్రయత్నం చేస్తున్నారేమో చూడాల్సి ఉంది. తమన్నా, రకుల్ ప్రీత్, పూజా హెగ్డేలకు ముంబై పరిశ్రమలో నిరంతరం అవకాశాలొస్తున్నాయి. ఆ ముగ్గురూ హిందీ చిత్రసీమలో కెరీర్ విస్తరణపై దృష్టి సారించారు.

# చూపు తిప్పుకోనివ్వని అందాల మృణాల్




హిందీ ప్రేక్షకులకు బుల్లితెర మరియు వెండి తెర ద్వారా సుదీర్ఘ కాలంగా సుపరిచితురాలు అయిన మృణాల్ ఠాకూర్ సీతారామం సినిమా తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెల్సిందే. నార్త్ లో ఎప్పటి నుంచో చేస్తున్నా కూడా దక్కని గుర్తింపు మరియు గౌరవం కేవలం సీతారామం సినిమాతో మృణాల్ దక్కించుకుంది. తక్కువ సమయంలోనే టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ ఇమేజ్ ను దక్కించుకుంది. తాజాగా హాయ్ నాన్న సినిమా తో వచ్చి మరో విజయాన్ని మృణాల్ తన ఖాతాలో వేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అవ్వడంతో చీర కట్టులో అయినా మోడ్రన్ డ్రెస్ లో అయినా మృణాల్ చూపు తిప్పుకోలేనంత అందంగా కనిపిస్తుంది. తాజాగా మరోసారి ఒక ట్రావెల్ సంస్థకి ప్రమోషన్ కోసం ఫోటో షూట్ లో మృణాల్ మెరిసింది. తాజా ఫోటో షూట్ లో మరింత అందంగా ఆకర్షణీయంగా ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ కనిపిస్తోందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న మృణాల్ ఠాకూర్ సినిమాల్లో ఆ స్థాయి అందాల ప్రదర్శన కు ఛాన్స్ రాలేదు అన్నట్లుగా కామెంట్స్ వినిపిస్తున్నాయి. బ్యాక్ టు బ్యాక్ టాలీవుడ్ లో విజయాలను సొంతం చేసుకున్న మృణాల్ హ్యాట్రిక్ కోసం విజయ్ దేవరకొండతో కలిసి ఫ్యామిలీ స్టార్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతోంది. అన్ని వర్గాల వారిని మెప్పిస్తూ టాలీవుడ్ లో బలమైన ముద్ర వేస్తున్న మృణాల్ ఠాకూర్ ముందు ముందు మరిన్ని పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు ఉన్నాయి.

## ఎల్లో ఎల్లో అషు అందాలు అదుర్స్

సోషల్ మీడియా ద్వారా జూనియర్ సమంత అంటూ పేరు దక్కించుకున్న అషు రెడ్డి చాలా తక్కువ సమయంలోనే బుల్లితెరపై సందడి చేసింది. ముఖ్యంగా బిగ్ బాస్ లో ఈ అమ్మడు ఎంట్రీ ఇచ్చిన తర్వాత తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలు అయిన విషయం అందరికి తెల్సిందే. హీరోయిన్ గా కూడా అషు రెడ్డికి ఆపర్లు వచ్చేంత అందంగా ఉంటుంది అనడంలో సందేహం లేదు. బిగ్ బాస్ తర్వాత సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ అయిన ముద్దుగుమ్మ అషు రెడ్డి సినిమాల్లో కూడా వరుసగా నటిస్తూ వచ్చింది. అయితే వచ్చిన ప్రతి ఒక్క ఆఫర్ కి ఓకే చెప్పకుండా మెల్ల మెల్లగా సినిమాలు చేస్తోంది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేసే అషు రెడ్డి మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేసి



అందరి దృష్టిని ఆకర్షించింది. అందమైన అషు రెడ్డి ఈసారి ఎల్లో డ్రెస్ లో మరింత అందంగా కనిపిస్తూ ఆహా అదుర్స్ అనిపించుకుంటోంది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. అషు రెడ్డి ఇంత అందంగా ఉన్నా కూడా తెలుగు అమ్మాయి అవ్వడం వల్ల సినిమాల్లో హీరోయిన్ గా ఆఫర్లు పెద్దగా రావడం లేదు. కానీ ఇతర భాషల్లో అషు రెడ్డి ప్రయత్నిస్తే తప్పకుండా ఆఫర్లు చాలానే వస్తాయి అనే అభిప్రాయం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. మరి అషు ఆ దిశగా ఏమైనా ప్రయత్నాలు చేస్తుందా చూడాలి.

## ఫోర్బ్ కవర్‌పై స్టైలిష్ చెర్రోపాసన

రామ్ చరణ్ - ఉపాసన దంపతులు అన్నివేళలా ఎందరికో స్ఫూర్తి. ఈ జంటకు 2023 అన్నివిధాలా కలిసొచ్చిన సంవత్సరం. బేబి క్లిన్ కారా జననంతో మెగా ఫ్యామిలీలో అంతా మారిపోయింది. సెలబ్రిటీ కపుల్ చరణ్- ఉపాసన సెలబ్రేషన్స్ కి అవధుల్లేవ్. చరణ్ ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో గేమ్ ఛేంజర్ లో నటిస్తున్నాడు. వరుస చిత్రాలకు ప్రణాళికల్ని రచిస్తున్నాడు. మరోవైపు భార్య, కుమార్తెతో కలిసి షికార్లు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఇంతలోనే ఇప్పుడు ఫోర్బ్స్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఈ అందమైన జంట ప్రత్యక్షమైంది. ముఖ్యంగా ఈ జోడీ లుక్ సెలెక్షన్ ఆఫ్ డ్రెస్ కోడ్ చర్చనీయాంశంగా మారింది. గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పింక్ స్వెట్ షర్ట్ ధరించి, ఫార్మల్ ఫ్యాంటు తో ఎంతో స్టైలిష్ గా కనిపించాడు.




అతడి చెంతనే ఉన్న ఉపాసన గులాబీ రెడ్ గౌనులో కనిపించింది. పవర్‌ఫుల్ కపుల్! అంటూ ఫోర్బ్స్ ఇండియా ఈ ఫీచర్ ని ప్రత్యేకంగా తీర్చిదిద్దింది. వరల్డ్స్ టాప్ మ్యాగజైన్ ఫోర్బ్స్ ఇటీవలి ఎడిషన్ కవర్ షూట్ లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ - ఉపాసన ప్రత్యేకం అని సదరు మ్యాగజైన్ వెల్లడించింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటో మెగాభిమానుల్లో వైరల్ గా మారింది. అందమైన కపుల్ ఎంతో ప్లెజెంట్ గా కనిపిస్తున్నారంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. మోవైపు రామ్ చరణ్ -ఉపాసన ప్రస్తుతం అనేక కమిట్‌మెంట్‌లను పూర్తి చేసేందుకు ముంబైలో ఉన్నారు. ఇప్పుడు ముంబైలోని మహారాష్ట్ర గౌరవనీయ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కార్యాలయాన్ని సందర్శించారు. కుమార్తె క్లిన్ కారా 6 నెలల సెలబ్రేషన్ ని జరుపుకున్న ఈ జంట ముందుగా మహాలక్ష్మి ఆలయంలో కనిపించారు. ఆ తరువాత ముంబైలో తమ బసను కొనసాగించారు. అనంతరం ఒక ముఖ్యమైన సందర్భం కోసం ముఖ్యమంత్రి కార్యాలయాన్ని అలంకరించారు. అతిథులను స్వాగతించడానికి షిండే కుమారుడు శ్రీకాంత్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంప్రదాయ తిలక్ వేడుక .. షిండే కోడలు వృశాలి ఆరతి కార్యక్రమం చరణ్ కుటుంబానికి సంప్రదాయ ఆతిథ్యాన్ని అందించింది.




హైదరాబాద్: అభయహస్తం దరఖాస్తుల అమ్మకాలపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి సచివాలయంలో ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష చేపట్టారు. దరఖాస్తులను ఎవరైనా అమ్మితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు అవసరమైనన్ని దరఖాస్తులను 'ప్రజాపాలన'లో అందుబాటులో ఉంచాల్సిందేనని స్పష్టం చేశారు. మరోవైపు, రైతు భరోసా, పింఛన్లపై అపోహలు వద్దని.. పాత లబ్ధిదారులందరికీ యథాతథంగా వస్తాయని చెప్పారు. కొత్తగా లబ్ధి పొందాలనుకునేవారే వీటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.




## టీఎస్ఆర్టీసీకి మరో 80 కొత్త బస్సులు.. ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్: తెలంగాణ ఆర్టీసీకి మరో 80 కొత్త ఆర్టీసీ బస్సులు (30 ఎక్స్‌ప్రెస్, 30 రాజధాని ఏసీ, 20 లహరి స్లీపర్, సీటర్‌లు) అందుబాటులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోని డా.బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. సంస్థ ఎండీ సజ్జనార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు. కార్మికుల సంక్షేమం, ఆర్టీసీ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని ఈ సందర్భంగా మంత్రి పొన్నం తెలిపారు. సీసీఎస్ బకాయిలు త్వరగా విడుదల చేస్తామని వెల్లడించారు. త్వరలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీకి అందుబాటులోకి రాబోతున్నట్లు ఎండీ సజ్జనార్ వెల్లడించారు. వీటిలో హైదరాబాద్‌కు 500, జిల్లాలకు 500 బస్సులు కేటాయించనున్నట్లు వివరించారు.

## రాజీనామాపై గవర్నర్ తమిళిసై క్లారిటీ




హైదరాబాద్: తెలంగాణ గవర్నర్‌గా తాను సంతోషంగా ఉన్నానని... గవర్నర్‌గా రాజీనామా చేసున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని తమిళిసై సౌందర్ రాజన్ తెలిపారు. నిరాధారమైన వార్తలను ప్రచారం చేయొద్దన్న గవర్నర్.. ఏదైనా నిర్ణయం ఉంటే అన్ని విషయాలు తెలియజేస్తానన్నారు. రాజకీయాలు అనేది నా కుటుంబ నేపథ్యంలోనే ఉందని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మళ్లీ పొలిటికల్ ఎంట్రీ ఇస్తున్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తమిళిసై ఢిల్లీ పర్యటన నేపథ్యంలో వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కోసమే హస్తినకు వెళ్లారనే వార్తలు వినిపించాయి. అయితే, తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారట. సొంత రాష్ట్రం తమిళనాడు నుంచి ఆమె పోటీ చేసేందుకు సిద్ధమయ్యారనే వార్తలు వినిపించాయి. ఇదిలా ఉండగా.. తమిళిసై గతంలో రెండు సార్లు ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో చెన్నై నార్త్, 2019లో తూత్తూకూడి నుంచి ఎంపీగా పోటీ చేసి పరాజయం చవి చూశారు. మరో మూడు పర్యాయాలు అసెంబ్లీకి పోటీ చేసినా.. ఆమె గెలుపు తలుపు తట్టలేదు. పార్టీకి ఆమె చేసిన సేవలను గుర్తించిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2019 సెప్టెంబర్‌లో తమిళిసైని తెలంగాణ గవర్నర్‌గా నియమించారు. 2021 నుంచి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, రాజ్యాంగబద్ధమైన పదవిని వదిలి ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని చూస్తున్నట్టు ప్రచారం జరిగింది.

## సతీసమేతంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన కింగ్ నాగ్

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని కింగ్ నాగార్జున తన భార్య అమల అక్కినేనితో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. జూబిలీహిల్స్‌లోని సీఎం నివాసంలో నాగార్జున దంపతులు సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియో నెట్టింట వైరల్ అవుతున్నాయి. రేవంత్‌రెడ్డిని సీఎంగా ప్రకటించిన సమయంలో టాలీవుడ్ నుంచి ముందుగా చిరంజీవి అభినందనలు తెలపడంతో పాటు.. రీసెంట్‌గా స్వయంగా తన ఇంటికి వెళ్లి ఆయనని అభినందించారు. మెగాస్టార్ చిరంజీవి తర్వాత రేవంత్ రెడ్డిని కింగ్ నాగార్జున ఇలా మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు అభినందనలు తెలియజేశారు.




## మహాలక్ష్మీ పథకానికి మంచి రెస్పాన్స్ వస్తోంది..



హైదరాబాద్: ప్రభుత్వం తీసుకువచ్చిన మహాలక్ష్మీ పథకానికి మంచి రెస్పాన్స్ వస్తోందని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద 80 కొత్త బస్సుల ప్రారంభ కార్యక్రమంలో సజ్జనార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు టీఎస్ఆర్టీసీ కృషి చేస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.400 కోట్ల వ్యయంతో అధునాతనమైన 1050 కొత్త డీజిల్ బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. ఇందులో 400 ఎక్స్ ప్రెస్, 512 పల్లె వెలుగు, 92 లహరి స్లీపర్ కమ్ సీటర్, 56 ఏసీ రాజధాని బస్సులున్నాయన్నారు. పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను హైదరాబాద్ సిటీలో 540, తెలంగాణలో ఇతర ప్రాంతాలకు 500 బస్సులను వాడకంలోకి టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తెస్తోందని టీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు.

## అందుకే ల్యాండ్ క్రూయిజర్ కార్లు విజయవాడలోనే ఉంచినట్టున్నారు..

హనుమకొండ: కాళేశ్వరం ప్రాజెక్టుపై తమ పార్టీ స్టాండు మారదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ప్రభుత్వం విచారణ జరుపుతోంది కదా... చూద్దాం ఏం జరుగుతుందోనన్నారు. ప్రభుత్వంలో ఉన్న వారి సెక్యూరిటీని అధికారులు చూస్తారన్నారు. అందులో భాగంగానే ల్యాండ్ క్రూయిజర్ కార్లు విజయవాడలో ఉంచినట్టున్నారని.. దీన్ని ఇష్యూ చేయడం వల్ల ముఖ్యమంత్రి గౌరవమే తగ్గుతుందని కవిత పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు మాకు కేవలం 1.7 శాతం మాత్రమే ఓట్ల తేడా ఉందన్నారు. వందరోజుల తర్వాత తమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమ్మక్క సారలమ్మ మహా జాతరకు జాతీయ పండగగా గుర్తింపు ఇవ్వాలని కవిత పేర్కొన్నారు. "లక్షలాది మంది భక్తులు దర్శించుకునే వన దేవతలకు జాతీయ గుర్తింపు ఇవ్వాలి. ఈ విషయంలో ప్రధాని మోదీ కృషి చేయాలి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సమ్మక్క సారలమ్మ జాతరను విస్మరించారు. తెలంగాణ వచ్చాక జాతరకు వైభవం తెచ్చాం. ఆర్టీసీ బస్సుల్లో రద్దీ వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. సరైన విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి. జాతరకు వచ్చే భక్తులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి. కాంగ్రెస్ ను ఈసారి పెద్ద ఎత్తున ప్రజలు ఆదరించారు కాబట్టి బాధ్యతతో పని చేయాలి. బీఆర్ఎస్ శ్రేణులు ధైర్యంగా ఉండాలి. అలవి కాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ పరిస్థితి ఎంత కాలం ఉండదు. కార్యకర్తలు అధైర్యపడొద్దు. పెన్షన్లు 1వ తారిఖే ఇవ్వాలి. ప్రజాపాలనలో ఇప్పటి వరకూ బ్యాంకు అకౌంట్లు అడగలేదు. కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించాలి. దరఖాస్తులో నిరుద్యోగ భృతి కాలం లేదు. ఉద్యమం చేసిన వాళ్లందరిపైనా ఎఫ్ఐఆర్‌లు లేవు. ఎఫ్ఐఆర్ ఉంటే బీఆర్ఎస్ వాళ్లపైన్నే ఉంటాయి" అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.



## కాళేశ్వరం ప్రాజెక్ట్ పై రేవంత్ సర్కార్ ఫైనల్ డెసిషన్ ఇదేనా?

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటినుంచీ కాళేశ్వరం ప్రాజెక్ట్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో అవకతవకలు జరిగాయని, ఇది ఒక ఫెయిల్యూర్ ప్రాజెక్ట్ అని కాంగ్రెస్ పార్టీ నేతలు దుబ్బయట్టారు. ఈ విషయంపై అసెంబ్లీలోనూ వాడీ వేడిగా చర్చలు జరిగాయి. ఈ క్రమంలో తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టును మంత్రుల బృందం సందర్శన అనంతరం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం దిశగా ఆలోచన చేస్తుందని తెలుస్తుంది! అవును... గత సర్కారు అవినీతి వల్లే కాళేశ్వరం ఇలా తయారైందని.. ఈ ప్రాజెక్టుతో ఎలాంటి ప్రయోజనం లేదని.. ఇది ఒక ఫెయిల్యూర్ ప్రాజెక్టు అని.. ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరిపిస్తామని తాజాగా ఇరిగేషన్ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి తెలిపారు.

తాజాగా కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన మంత్రుల బృందం ఈ విషయాలపై తీవ్రస్థాయిలో మండి పడింది. ఈ సమయంలో కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన బ్యారేజీలకు భారీ నష్టం వాటిల్లిందని.. ప్రస్తుతం గోదావరి నదిపై నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును డంప్ చేసి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని తెలుస్తుంది! ఇప్పుడు ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ బృందం.. మీడియా ప్రతినిధుల బృందంతో కలిసి కాళేశ్వరంలోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను సందర్శించాయి. ఈ సందర్భంగా కాళేశ్వరం బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్ర లోపాలున్నాయని ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి ఉత్తం కుమర్ రెడ్డి తెలిపారు. ఇదే సమయంలో... ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.1.27 లక్షల కోట్లు కాగా.. ఇంకా ఎంత ఖర్చవుతుందో తెలియదని.. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణపై ఏడాదికి రూ.15 వేల కోట్ల ఆర్థిక భారం పడుతుందని.. ఇప్పటికే నీటిపారుదల శాఖ వద్ద కోటి బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. ఇదే క్రమంలో... కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును పునరుద్ధరిస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇంతటి ముఖ్యమైన ప్రాజెక్ట్ నిర్మాణం జరిగిన మూడేళ్లలోపే కుప్పకూలడం చాలా సిగ్గుచేటని.. ఉత్తం మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ఇప్పటివరకు రూ.95 వేల కోట్లు ఖర్చు చేసి, కేవలం 97 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీళ్లిచ్చారని.. అంటే ఒక ఎకరానికి నీళ్లు ఇచ్చేందుకు కోటి రూపాయల చొప్పున ఖర్చు చేసిన ఘనత గత ప్రభుత్వానిదని మండిపడ్డారు. మరోవైపు ఇంజనీర్ ఇన్ చీఫ్ మురళీధర్.. కాళేశ్వరం ప్రాజెక్టుపై 108 పేజీల పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో పాటు మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలకు జరిగిన నష్టాలను సవివరంగా వివరించారు. దీంతో... కాళేశ్వరం ప్రాజెక్టును డంప్ చేసి ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తుందనే కామెంట్లు బలంగా వినిపిస్తున్నాయి!!



## దేశంలో సెకండ్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్ : కొన్ని ఘనకీర్తులు విన్నంతనే వావ్ అనేస్తాం. కానీ.. లోతుల్లోకి వెళ్లినప్పుడు నిజమే కదా? అనిపించకమానదు. ఇప్పుడు అలాంటి పరిస్థితే హైదరాబాద్ మహానగరానికి. దేశంలో మరే మహానగరానికి లేని కొత్త ఇమేజ్ హైదరాబాద్ సొంతమవుతోంది. గడిచిన కొన్నేళ్లుగా హైదరాబాద్ అంతకంతకూ అందరికి నచ్చేస్తోంది. రికార్డుల్ని క్రియేట్ చేస్తూ.. దేశ రాజధాని ఢిల్లీ.. ఆర్థిక రాజధాని ముంబయితో పోటీ పడుతూ.. మిగిలిన మెట్రోపాలిటిన్ సిటీస్ కు ఆసూయ కలిగేలా చేస్తోంది. తాజాగా మరో కీర్తిని సొంతం చేసుకుంది. దేశ వ్యాప్తంగా ఇళ్ల ధరలకు సంబంధించి రెండో ఖరీదైన నగరంగా హైదరాబాద్ నిలిచింది. మొదటి స్థానంలో ముంబయి నిలిచింది. స్థిరాస్తి సేవల సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన ఒక రిపోర్టులో ఈ విషయాన్ని వెల్లడించారు. అఫర్డబుల్ ఇండెక్స్ లో ఆదాయంలో ఇంటి రుణం నెలవారీ కిస్తీకి చెల్లించే నిష్పత్తి ఆధారంగాఈ రిపోర్టును తయారు చేస్తారు. దీని ప్రకారం ఈ ఏడాది (2023)లో హైదరాబాద్ మహానగరంలోని ఇళ్ల ధరలు 11 శాతం పెరిగినట్లుగా రిపోర్టు చెబుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబయిలో ఇంటి కొనుగోలుదారులు తమ ఆదాయంలో 51 శాతం వరకు ఈఎంఐకు చెల్లించాల్సి వస్తే.. హైదరాబాద్ లో ఇది 30 శాతంగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 27 శాతం ఉండగా..గార్డెన్ సిటీ బెంగళూరు 26 శాతంగా ఉంది. చెన్నై 25శాతం.. పుణె 24 శాతం.. కోల్ కతా 24 శాతం.. అహ్మదాబాద్ 21 శాతంగా ఉన్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. మరి.. రానున్న ఏడాది పరిస్థితి ఎలా ఉంటుంది? అన్న అంశంపైనా నివేదిక తన అభిప్రాయాన్ని వెల్లడించింది. పెరిగే వృద్ధి రేటుతో పాటు ద్రవ్యోల్బణం అదుపులో ఉంటుందని అంచనా వేసింది. దీంతో.. ఇళ్ల కొనుగోలు శక్తి పెరుగుతుందని చెప్పింది. కొనుగోలు శక్తి ఎంత పెరిగినా.. ఆకాశమే హద్దుగా మారిన పరిస్థితుల్లో సామాన్యుడి సంగతి తర్వాత.. మధ్యతరగతి వారు సైతం సొంతింటి కలను నెరవేర్చుకోవటం కష్టంగా మారుతోంది. హైదరాబాద్ మహానగర వెలుగు బాగానే ఉన్నా.. ఆ మెరుపుల వెనుక ఉన్న చీకట్లు అంతకంతకూ ఎక్కువ అవుతున్నాయి. ఒకప్పుడు ఒక మోస్తరు జీతాలు ఉన్న వారు సైతం హైదరాబాద్ లో హ్యాపీగా పెరిగేవారు. ఇప్పుడు.. కష్టంగా మారింది. ఇంటి ధర పెరిగితే.. ఆటోమేటిక్ గా ఇళ్ల అద్దెలు కూడా పెరుగుతాయన్నది అసలు సమస్య.



## కొత్త సంవత్సర వేడుకలు విషాదం కావద్దు.. గీత దాటితే చర్యలు తప్పవు!

హైదరాబాద్ : కొత్త సంవత్సర సంబరాల కోసం ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. పబ్‌లు, రెస్టారెంట్‌లు పార్టీ ప్రియులను ఆకర్షించేందుకు అనేక హంగామాలు చేస్తున్నాయి. ఉత్సాహం విషాదం కావద్దని అందరూ కోరుకుంటారు. కానీ మద్యం మత్తులో తప్పులో కాలేయడం యాదృచ్ఛికంగా జరిగిపోతుంటుంది. కొత్త సంవత్సర హుషారు ఎప్పటికీ గుర్తుండాలంటే నిబంధనలను పాటించి తీరాల్సిందేనని పోలీసులు హుకుం జారీ చేస్తున్నారు. పబ్‌లు, రెస్టారెంట్లు, కాఫీ సెంటర్లు, బార్‌లు, మద్యం షాపులు నిబంధనలకు లోబడి నడుచుకోవాలని సూచిస్తున్నారు. పబ్ యజమానులకు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గీత దాటితే కఠినచర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. గతంలో చోటుచేసుకున్న సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**పబ్‌లు, బార్‌లే లక్ష్యంగా :** బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. అర్ధరాత్రి సమయంలో యువతే ఎక్కువగా మృత్యువాత పడుతున్నట్టు సర్వేలు చెబుతున్నాయి. వీరిలో 95 శాతం మంది మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ మరణిస్తున్నారు. గతంలో కొత్త సంవత్సర వేడుకల్లో భాగంగా రోడ్డు ప్రమాదంలో సుమారు 20 మంది యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఈసారి ప్రమాదాలు జరగకుండా పబ్‌లు, బార్, రెస్టారెంట్ల నిర్వాహకులు సహకరించాలని పోలీసులు కోరుతున్నారు.

**పబ్‌లపై ప్రత్యేక దృష్టి..** పబ్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కొత్త కమిషనర్ కోట శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డ్రగ్స్‌కు కేంద్రంగా మారుతున్న పబ్‌లను తరచూ తనిఖీ చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సిబ్బందిని సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. అమ్యూజ్‌మెంట్ లైసెన్స్‌లు లేని వారిపై దృష్టి సారించారు. కొత్త సంవత్సర వేడుకలు పూర్తయ్యాక పార్టీ ప్రియులు రోడ్ల మీదకు వచ్చి హంగామా చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**ఇవీ నిబంధనలు** : పబ్‌లు అర్ధరాత్రి ఒంటిగంట తరువాత సేవలు నిలిపివేయాలి. కేక్ కటింగ్ పూర్తయ్యాక పరిసరాల నుంచి పార్టీ ప్రియులను పంపించేయాలి. ఎమ్యూజ్‌మెంట్ లైసెన్స్ ఉన్న వారు మాత్రమే సంగీతం పెట్టాల్సి ఉంటుంది. లేని వారు శబ్దాలు చేస్తే సహించేది లేదు. మైనర్లను ఎట్టి పరిస్థితిలో పబ్‌లోకి అనుమతించవద్దు. తల్లిదండ్రులతో వస్తే అనుమతించినా మద్యం సరఫరా చేయరాదు. పార్టీ కోసం వచ్చే వారు గొడవపడకుండా ఉండేలా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకోవాలి. సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు సిబ్బందిని సమకూర్చుకోవాలి. పార్కింగ్‌ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. రోడ్డు మీద పార్కింగ్‌కు అవకాశం ఇస్తే సహించేది లేదు. సమయానికి మించి నిమిషం ఆలస్యం చేసినా బార్‌లు, మద్యం దుకాణాల నిర్వాహకులపై కేసులు పెడతారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com